thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

మంధాన మరో మైలురాయి..



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 152 | జగిత్యాల శనివారం 05 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## మహిళపై లైంగిక దాడి యత్నం.. అడ్డుకున్న వీధికుక్క!




- కోయం బత్తూరులో వెలుగులోకి వచ్చిన ఘటన
- మహిళ కేకలకు స్పందించిన శునకం

.. వివరాలు 4లో

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

- జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్
- దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు

4



## నింగిలోకి ఈవోఎస్-05

- ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!
- భూస్థిర కక్ష్యలో పని చేయనున్న ఇమేజింగ్ శాటిలైట్
- ఐదేళ్ల క్రితం విఫలమైన మిషన్‌కు ప్రత్యామ్నాయం

4



# అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలి

నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష
- భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు
- విద్యా సంస్థల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట
- ఎత్తిపోతల పథకం.. రోడ్లపై ప్రత్యేక దృష్టి



**హకీంపేట, సెప్టెంబర్ 4 :** నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మద్దూరు, దౌల్తాబాద్, హకీంపేట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న విద్యా సంస్థలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం హకీంపేటలో ఉన్నతాధికారులతో సమావేశమై కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. విద్యా సంస్థలు, సాగునీటి పథకాలు, రహదారులు సహా అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను సీఎం తొలుత పరిశీలించారు. నిర్మాణ ప్రణాళికలను పరిశీలిస్తూ ప్రాంగణమంతా కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో ఈ స్థలం కోసం భూములిచ్చిన రైతులను ప్రత్యేకంగా గుర్తించి వారితో మాట్లాడారు. భూములిచ్చిన ప్రతి రైతు

మిగతా 2 లో



## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్

2

- 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతాపై కేసు నమోదు
- సీఎస్‌వో కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదుతో చర్యలు
- రహస్య సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే దానిపై దర్యాప్తు
- అధికారుల పాత్రపైనా పోలీసుల ఆరా



## కేబినెట్‌లోకి రాములమ్మ!?

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం తీవ్ర కలకలం రేపుతోంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో, ఆమె స్థానంలో మరో బలమైన మహిళా నేతను రేవంత్ రెడ్డి కేబినెట్‌లోకి తీసుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చి ప్రధానంగా వినిపిస్తోంది.

2

- మంత్రి పదవిపై విజయశాంతి పేరు జోరుగా ప్రచారం
- మహిళా కోటాలో అవకాశం కల్పించే యోచన
- అధిష్ఠానంతో చర్చలు సిద్ధమవుతున్నట్లు సమాచారం
- హోంశాఖపై విజయశాంతి ఆసక్తి అంటూ ఊహాగానాలు
- మరోవైపు ఆది శ్రీనివాస్ పేరూ పరిశీలనలో!

## నేను ఎక్కడికీ వెళ్లడం లేదు



- మాజీ మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్‌ను వీడేది లేదని ప్రకటన
- బీజేపీ.. కొత్త పార్టీ ప్రచారాన్ని తోసిపుచ్చిన సురేఖ
- సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదని స్పష్టీకరణ
- కేసీఆర్‌పై సురేఖ ప్రశంసలు!

3

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు

కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు



2



## కొత్తగా 'చేయూత' పింఛన్లు

- దరఖాస్తులకు ఈ నెల 15 వరకు అవకాశం
- పత్రాలు లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఛాన్స్
- పరిశీలన సమయంలో ధ్రువపత్రాలు తప్పనిసరి

3

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

- బాధ కలిగించినా పార్టీ క్రమశిక్షణే ముఖ్యం
- సుస్మిత వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం
- సమస్యలుంటే పార్టీలోనే చర్చించాలి
- సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం..
- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

2





## సన్నబియ్యం అమ్మితే.. రేషన్ కార్డు కట్!

- లబ్ధిదారులకు మంత్రి తుమ్మల గట్టి హెచ్చరిక
- పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే సర్పంచులపై చర్యలు
- పోడు భూముల సమస్యకు త్వరలో పరిష్కారం
- కరువు నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- రఘునాథపాలెంలో రూ.75 కోట్లతో రోడ్లు

2



# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

**సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

**బాధ కలిగించినా పార్టీ క్రమశిక్షణే ముఖ్యం**

**సుస్మిత వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం**

**సమస్యలుంటే పార్టీలోనే చర్చించాలి**

**సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**కాంగ్రెస్ పార్టీలో ఎంతటి నాయకుడైనా క్రమశిక్షణ హద్దులు దాటితే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించడం బాధ కలిగించే పరిణామమే అయినప్పటికీ.. పార్టీ క్రమశిక్షణ అన్నింటికంటే ముఖ్యమని తేల్చిచెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన సురేఖపై అధిష్ఠానం తీసుకున్న చర్యకు దారితీసిన పరిణామాలను వివరించారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వ్యవహారంలో ఆమె వైఖరిపై క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే అధిష్ఠానం చర్యలు తీసుకుందని చెప్పారు. పార్టీలో ఏవైనా సమస్యలు, అసంతృప్తులు ఉంటే చర్చించేందుకు అనేక అంతర్గత వేదికలు అందుబాటులో ఉన్నాయని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి తదితరుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లవచ్చన్నారు. వాటిని పక్కనపెట్టి బహిరంగంగా మీడియా ముందు పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. "కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు. నాయకుడు ఎంతటి వారైనా క్రమశిక్షణ విషయంలో మినహాయింపు ఉండదు" అని మహేశ్ గౌడ్ తేల్చిచెప్పారు. సురేఖపై చర్య తీసుకున్నప్పటికీ ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో కొనసాగితే భవిష్యత్తులో ఆమెకు అవకాశాలు వస్తాయని సూచనప్రాయంగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సన్నబియ్యం అమ్మితే.. రేషన్ కార్డు కట్!

**లబ్ధిదారులకు మంత్రి తుమ్మల గట్టి హెచ్చరిక**

**పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే సర్పంచులపై చర్యలు**

**పోడు భూముల సమస్యకు త్వరలో పరిష్కారం**

**కరువు నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం**

**రఘునాథపాలెంలో రూ.75 కోట్లతో రోడ్లు**

**ఖమ్మం, సెప్టెంబర్ 5 :**ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని బయట విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని కొందరు లబ్ధిదారులు బయట విక్రయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తుమ్మల తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేయవద్దని సూచించారు. సన్నబియ్యాన్ని విక్రయిస్తున్న వారిని గుర్తిస్తే వారి రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను మంత్రి ఆదేశించారు. ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు తావులేకుండా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందేలా చూడటంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచుల పదవులపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కరువు పరిస్థితులు తలెత్తే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నట్లు తుమ్మల పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. పామాయిల్ సాగును చేపట్టే రైతులకు ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. రఘునాథపాలెం మండల రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సాగునీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు చేపట్టవచ్చని తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు పట్టాలు ఉన్న రైతులకు నిబంధనల మేరకు బోరుబావుల అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తుమ్మల హామీ ఇచ్చారు. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలంలో రూ.75 కోట్లతో సుమారు 200 దంపర్ రోడ్లతో పాటు రైతులు పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ త్వరలోనే స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి

కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వినతిపత్రాలను స్వీకరించారు. మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను కూడా సీఎం పరిశీలించారు. కళాశాల డిజైన్లు, లేఅవుట్‌ను పరిశీలించి పలు మార్పులు సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



**హకీంపేటలో భారీ విద్యా హబ్**

అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకున్న సీఎం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ కళాశాలలు, హాస్టళ్లు, ఇతర భవన సముదాయాల నిర్మాణాలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య, వెటర్నరీ,



నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు 400 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టళ్ల భవన సముదాయాలను సీఎం పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రాంగణంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ బావులు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని సంరక్షించి ల్యాండ్‌స్కేపింగ్‌కు ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**దౌల్తాబాద్‌లోనూ పరిశీలన**

జిల్లాల పర్యటనలో భాగంగా వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాద్ గ్రామంలో నిర్మిస్తున్న బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సీఎం పరిశీలించారు. దౌల్తాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనుల పురోగతిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక సమీక్ష**

హకీంపేటలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సీఎం సమగ్రంగా సమీక్షించారు. మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం, నియోజకవర్గంలోని రోడ్డు అనుసంధానం, ప్రభుత్వ భవనాల నిర్మాణం, తండాలకు రహదారులు, ఇతర మౌలిక వసతుల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని పనుల్లో జాప్యానికి తావివ్వకుండా ముందుకు సాగాలని ఆదేశించారు. విద్యా హబ్ నుంచి ఎత్తిపోతల పథకం వరకు.. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి ప్రాజెక్టు నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్

- ఢిల్లీ పర్యటన భద్రతా వివరాలు సామాజిక మాధ్యమాల్లోకి
- 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతాపై కేసు నమోదు
- సీఎస్‌వో కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదుతో చర్యలు
- రహస్య సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే దానిపై దర్యాప్తు
- అధికారుల పాత్రపైనా పోలీసుల ఆరా

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం సామాజిక మాధ్యమాల్లోకి రావడం కలకలం రేపింది. సీఎం ఢిల్లీ పర్యటన సందర్భంగా రూపొందించిన బందోబస్తు వివరాలను 'తెలుగు స్క్రైబ్' పేరుతో ఉన్న ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వ్యవహారంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముఖ్యమంత్రి ప్రధాన భద్రతాధికారి కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సీఎం ఢిల్లీ పర్యటనకు సంబంధించి నిమిషాల వారీ కార్యక్రమం, భద్రతా ఏర్పాట్లతో కూడిన సమాచారాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు వైర్‌లెస్ సందేశం ద్వారా పంపినట్లు ఫ్రాంక్లిన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, డీజీపీ తదితర సంబంధిత అధికారులకు మాత్రమే ఈ సమాచారం చేరాల్సి ఉందని తెలిపారు.

**పర్యటన సాగుతుండగానే పోస్టు!**

ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే భద్రతకు సంబంధించిన రహస్య వైర్‌లెస్ సందేశంలోని వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎం పర్యటన షెడ్యూల్‌తో పాటు భద్రతాపరంగా సున్నితమైన మరికొన్ని వివరాలు కూడా అందులో ఉన్నట్లు తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు ఏర్పడే



అవకాశం ఉందని సీఎస్‌వో ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఇలాంటి వైర్‌లెస్ సందేశాలు బయటకు వెళ్లకూడదని, సంబంధిత వ్యవస్థలోని ఎవరో ఈ సమాచారాన్ని సామాజిక మాధ్యమ ఖాతాకు చేరవేసి ఉండవచ్చని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సమాచారం ఎక్కడి నుంచి, ఎవరి ద్వారా బయటకు వెళ్లిందనే అంశాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ**

ఈ వ్యవహారంపై తొలుత ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు కోసం కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి తిరిగి నమోదు చేసినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఖాతాకు రహస్య సమాచారం ఎలా చేరింది? అధికారిక వ్యవస్థలో ఎక్కడైనా సమాచారం లీకైందా? ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది? అనే కోణాల్లో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించిన వ్యవహారం కావడంతో సమాచార లీకేజీ మూలాన్ని గుర్తించడంపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు.

# కేబినెట్‌లోకి 'రాములమ్మ'!?



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై మరోసారి రాజకీయ చర్చ జోరందుకుంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతకు అవకాశం కల్పించే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి పేరు ప్రధానంగా తెరపైకి వచ్చింది. మంత్రి పదవి విషయమై ఆమె అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొండా సురేఖ మంత్రివర్గం నుంచి వైదొలగడంతో ప్రస్తుతం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో మరో మహిళకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచన కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే 'రాములమ్మ'గా గుర్తింపు పొందిన విజయశాంతి పేరు బలంగా వినిపిస్తోంది. మహిళా కోటాలో విజయశాంతితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై పార్టీ నుంచి అధికారిక సంకేతాలేవీ వెలువడలేదు. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతికి గుర్తింపు ఉంది. గతంలో బీఆర్‌ఎస్ తరఫున ఎంపీగా పనిచేసిన అనుభవంతో ఆ పార్టీ రాజకీయ వ్యూహాలు, నేతల వ్యవహారశైలిపై ఆమెకు అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు విజయశాంతి వంటి బలమైన స్వరం మంత్రివర్గంలో ఉంటే పార్టీకి ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం కూడా రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తన రాజకీయ భవిష్యత్తుతో పాటు మంత్రివర్గంలో అవకాశం కల్పించే అంశంపైనా చర్చించవచ్చని తెలుస్తోంది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. అప్పటి నుంచి కీలక రాజకీయ పరిణామాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. విజయశాంతికి మంత్రి పదవి దక్కితే హోంశాఖ కావాలని కోరుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తి రేపుతోంది. అయితే ఈ అంశంపై విజయశాంతి గానీ, కాంగ్రెస్ అధిష్ఠానం గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అందువల్ల హోంశాఖకు సంబంధించిన ప్రచారాన్ని ప్రస్తుతం ఊహాగానంగానే చూడాల్సి ఉంది. మరోవైపు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కూడా మంత్రివర్గంలోకి తీసుకునే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కేబినెట్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ కొత్త ముఖాలకు అవకాశం కల్పించడంతో పాటు కొందరు సీనియర్ మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశంపైనా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా..? మహిళా కోటాలో 'రాములమ్మ'కు అధిష్ఠానం పచ్చజెండా ఊపుతుందా..? ఒకవేళ కేబినెట్‌లోకి వస్తే ఆమెకు ఏ శాఖ దక్కుతుంది..? అన్న ప్రశ్నలకు కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయమే సమాధానం చెప్పనుంది.

# జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు..

**కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై దాడిచేయడంతో ఘర్షణగా మారింది. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలోని విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో జేఎన్టీయూ రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని విద్యార్థులను నిలువరించారు. విషయం తెలుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. దీంతో మాటా మాటా పెరిగి.. ఘర్షణగా మారింది. ఈ ఘటనపై వర్సిటీ యాజమాన్యం విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధన వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు. తొమ్మిది రోజుల పాటు మూడు పూటలా నీరు పోసి మొలకలు పెంచుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారు. భజనలు, ఆటపాలలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

# నేను ఎక్కడికీ వెళ్లడం లేదు

- మాజీ మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్‌ను వీడేది లేదని ప్రకటన
- బీజేపీ.. కొత్త పార్టీ ప్రచారాన్ని తోసిపుచ్చిన సురేఖ
- సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదని స్పష్టీకరణ
- కేసీఆర్‌పై సురేఖ ప్రశంసలు!



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**మంత్రివర్గం నుంచి తొలగింపు తర్వాత కొండా సురేఖ చుట్టూ రాజకీయ ప్రచారం మరింత వేడెక్కుతోంది. ఒకవైపు తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేస్తుండగా.. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. అయితే తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని సురేఖ తేల్చిచెప్పారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" అంటూ తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని పోస్టులు చక్కర్లు కొడుతున్నాయని సురేఖ పేర్కొన్నారు. వాటితో తనకు గానీ, తన కుటుంబానికి గానీ ఎలాంటి సంబంధం లేదని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. అలాంటి పోస్టులను ఎవరూ నమ్మవద్దని కోరుతూ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలను వెల్లడించారు. మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాతే ఈ తరహా పోస్టులు విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో సురేఖ స్పందించారు. బీజేపీలో చేరబోతున్నారని, కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నారని జరుగుతున్న ప్రచారాన్నీ ఆమె తోసిపుచ్చారు. "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అంటూ కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించిన తీరుపై మాత్రం సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకొచ్చి తనను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. ఈ పరిణామాల వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి పాత్ర ఉందని కూడా విమర్శించారు. అంతకుముందు సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. పరకాల రాజకీయాలపైనా ఆమె చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేయగా.. ఆమె ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని క్రమశిక్షణ సంఘం చర్యలకు సిఫార్సు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్‌పై సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకున్న ఆమె.. "కేసీఆర్ చాలా మంచి వ్యక్తి. మేం ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో ఉన్నంతకాలం కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని చెప్పారు. తమ కుటుంబం కోరినప్పుడు కొండా మురళికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. అప్పట్లో మురళికి ఎమ్మెల్సీ పదవి దక్కకుండా కొందరు సీనియర్ నేతలు ప్రయత్నించినప్పటికీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని ఆయన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించారని సురేఖ పేర్కొన్నారు.

ఒకవైపు కాంగ్రెస్‌ను వీడబోనని సురేఖ స్పష్టంగా చెబుతుండటం.. మరోవైపు కేసీఆర్ వ్యక్తిత్వం, గతంలో ఆయన తమ కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీంతో కొండా దంపతుల భవిష్యత్ రాజకీయ అడుగులపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే కేసీఆర్‌పై చేసిన ప్రశంసలను బీఆర్ఎస్‌లో చేరేందుకు సంకేతంగా భావించడానికి ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆధారం లేదు. సురేఖ స్వయంగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేసిన నేపథ్యంలో పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారం ప్రస్తుతానికి ఊహాగానాలకే పరిమితమైంది.

# కొత్తగా 2.50 లక్షల 'చేయూత' పింఛన్లు

- దరఖాస్తులకు ఈ నెల 15 వరకు అవకాశం
- పత్రాలు లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఛాన్స్
- పరిశీలన సమయంలో ధ్రువపత్రాలు తప్పనిసరి
- పింఛన్ ఆగిపోయిన వారూ మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- ఇప్పటికే 4.34 లక్షల దరఖాస్తులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**తెలంగాణలో కొత్తగా 2.50 లక్షల మందికి 'చేయూత' సామాజిక పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసే సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. అయితే దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గీత కార్మికులు ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఒంటరి మహిళలకు తహసీల్దార్ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులకు సదరం లేదా యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ సహాయ సంచాలకుడి ధ్రువీకరణ పత్రం అవసరమని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఇవి లేకున్నా నమోదు చేసుకోవచ్చని, క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్ పొందుతూ వివిధ కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అర్హతకు సంబంధించిన పత్రాలను పరిశీలన సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. వాస్తవానికి కొత్త పింఛన్ల దరఖాస్తుల గడువు జులై 31తో ముగిసింది. అయితే ఇంకా చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేదన్న విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. చేయూత పథకం కింద ఐదు కేటగిరీల్లో కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఆగస్టు 30 నాటికి మొత్తం 4.34 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల దరఖాస్తులు వితంతువుల నుంచి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గడువు పొడిగించడంతో మరో 50 వేలకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించనున్నారు. కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అర్హుల ఎంపికపై దరఖాస్తుదారుల్లో ఆసక్తి నెలకొంది.

# దమ్ముంటే నాపై నీ భార్యను పోటీ చేయించు!

**హరీశ్‌రావుకు కవిత ఓపెన్ ఛాలెంజ్**

**'మీ ఇద్దరిలో ఎవరు వచ్చినా ఎదుర్కొంటా'**

**సిద్దిపేట నుంచి బరిలోకి దిగుతానని పునరుద్ఘాటన**

**'తెలంగాణకు సీఎం కావాలన్నదే నా ఆకాంక్ష'**

**రేవంత్ పాలనపైనా ఘాటు విమర్శలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకుని నేరుగా ఎన్నికల సవాల్ విసిరారు. "దమ్ముంటే నాపై మీ భార్యను పోటీ చేయించండి. హరీశ్‌రావు వచ్చినా.. ఆయన భార్య వచ్చినా ఎదుర్కొనేందుకు నేను సిద్ధం" అంటూ ప్రకటించారు. గతంలో సిద్ధిపేటలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకుని వరుసగా విమర్శలు చేస్తున్న కవిత.. తాజాగా ఆయన కుటుంబాన్ని కూడా ప్రస్తావిస్తూ రాజకీయ సవాల్ విసిరారు. హరీశ్‌రావు కావాలంటే రాజకీయాల నుంచి పక్కకు తప్పుకుని తన భార్యను బరిలోకి దింపవచ్చని వ్యాఖ్యానించారు. "ఎవరు పోటీ చేసినా నాకు అభ్యంతరం లేదు. ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా" అని తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని గతంలో తాను చేసిన ప్రకటన వాస్తవమేనని కవిత గుర్తుచేశారు. తాజాగా చేసిన వ్యాఖ్యలతో సిద్ధిపేటతో పాటు బోధన్ నియోజకవర్గంపైనా ఆమె దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే విషయంపై ఆమె స్పష్టమైన ప్రకటన చేయలేదు. హరీశ్‌రావుతో కవితకు ఏర్పడిన రాజకీయ విభేదాలు ఇటీవలి కాలంలో బహిరంగంగానే కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని, పార్టీలో పట్టు సాధించేందుకు చూస్తున్నారని గతంలో కవిత ఆరోపించారు. హరీశ్‌రావుపై అవినీతి సహా పలు తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. అయితే అవన్నీ కవిత చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప నిర్ధారిత అంశాలుగా పరిగణించలేం. తన భవిష్యత్ రాజకీయ లక్ష్యంపైనా కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్ష తనకు ఉందని వెల్లడించారు. దీంతో రాబోయే రోజుల్లో తన రాజకీయ కార్యాచరణను మరింత విస్తృతం చేసుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారనే చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాలకు, ముఖ్యమంత్రి ప్రకటనలకు మధ్య పొంతన ఉండటం లేదని ఆరోపించారు. "ఇకపై తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదు.. రేవంత్‌రెడ్డిలా ఉన్నావంటే సరిపోతుంది" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హరీశ్‌రావుపై కవిత వరుస విమర్శలు, ఇప్పుడు ఆయన భార్యను సైతం ప్రస్తావిస్తూ విసిరిన ఎన్నికల సవాల్ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. హరీశ్‌రావును నేరుగా రాజకీయ ప్రత్యర్థిగా నిలబెట్టుకోవడం ద్వారా తనకంటూ ప్రత్యేక రాజకీయ స్థానం ఏర్పరచుకునే ప్రయత్నంలో కవిత ఉన్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా "హరీశ్‌రావైనా.. ఆయన కుటుంబం నుంచి మరెవరైనా.. ఎన్నికల బరిలో ఎదుర్కొనేందుకు సిద్ధం" అన్న సంకేతాన్ని కవిత తన తాజా వ్యాఖ్యల ద్వారా ఇచ్చారు. దీంతో కవిత--హరీశ్‌రావు మధ్య సాగుతున్న రాజకీయ పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి.

# అసెంబ్లీ పోరుకు బీఆర్ఎస్ వ్యూహం

**రేపు ఎర్రవల్లిలో శాసనసభాపక్ష భేటీ**

**కేసీఆర్ అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం**

**ప్రజా సమస్యలపై సర్కారును నిలదీసేందుకు కార్యాచరణ**

**పార్టీ ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**రాష్ట్ర శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అసెంబ్లీ పోరుకు సిద్ధమవుతోంది. సభలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ఈ నెల 6న బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో ఈ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం అనంతరం 2 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు, హామీల అమలు తదితర అంశాలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీలో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రభుత్వాన్ని ఏ అంశాలపై ప్రశ్నించాలి, పార్టీ సభ్యులు సభలో సమన్వయంతో ఎలా వ్యవహరించాలనే దానిపై కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ఒక్కరోజు ముందే జరుగుతున్న ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# కొండా సురేఖను తొలగించారు..

**పొంగులేటి సంగతి ఏమిటి?**

**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

**మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**సురేఖకు బీఆర్ఎస్ తలుపులు బంద్**

**రాజగోపాల్‌రెడ్డిపై జగదీశ్ ఫైర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ బీఆర్ఎస్‌లో చేరుతారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునేది లేదని, విమర్శలు చేసిన వారికి తలుపులు మూసుకుపోయాయని తేల్చిచెప్పారు. అదే సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ సంచలన ప్రకటన చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా బీఆర్ఎస్‌లోకి తీసుకోమని, ఆయనకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వం డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని విమర్శించారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన అవినీతి ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపించాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. తప్పులు చేసినందుకు బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని, సంబంధిత వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థలకు పంపించామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల కుంభకోణాన్ని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో ఉందన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా విచారణ జరిపించాలని ఆయన కోరారు.

## సంపాదకీయం



# ఏఐ నిపుణులకు భారీ డిమాండ్

## వేతనాల్లో 23 శాతం వృద్ధి!

**సీనియర్లకు రూ.89 లక్షలకుపైగా వార్షిక ప్యాకేజీ**

**అత్యధిక వేతనాల మార్కెట్‌గా బెంగళూరు**

**గట్టి పోటీదారుగా దూసుకొస్తున్న హైదరాబాద్**

కృత్రిమ మేధకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వ్యాపార సంస్థల నుంచి సాంకేతిక కంపెనీల వరకు ఏఐ వినియోగం విస్తరిస్తుండటంతో ఆ రంగంలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు డిమాండ్‌తో పాటు వేతనాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. 2024-2026 మధ్య భారత్‌లో ఏఐ సంబంధిత ఉద్యోగాల వేతనాలు 23 శాతం పెరిగినట్లు ఉద్యోగాల వేదిక ఫౌండిట్ తాజా నివేదిక వెల్లడించింది. మరోవైపు కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాలు తగ్గడం లేదా స్తంభించిపోవడంతో ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసం మరింత స్పష్టమవుతోంది. గత ఏడాది ఏఐ రంగంలో వార్షిక ప్రాతిపదికన వేతనాలు 12 శాతం పెరిగాయని నివేదిక తెలిపింది. పరిశీలించిన రంగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్ రంగాలు చెరో 9 శాతం వృద్ధితో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈ--కామర్స్ రంగాల్లో గత రెండేళ్లుగా వేతనాలు తగ్గుముఖం పట్టగా.. ఐటీ సేవల రంగంలో పెద్దగా వృద్ధి కనిపించలేదని పేర్కొంది.

### ఏఐలో రూ.89 లక్షల వరకు ప్యాకేజీ

ఏఐ రంగంలోకి కొత్తగా అడుగుపెడుతున్న వారికీ ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తున్నాయి. సున్నా నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న నిపుణులకు ఏటా రూ.8.87 లక్షల నుంచి రూ.15.41 లక్షల వరకు వేతనాలు లభిస్తుండగా.. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న వారికి రూ.70.99 లక్షల నుంచి రూ.89.24 లక్షల వరకు అందుతున్నట్లు నివేదిక వెల్లడించింది. అయితే ప్రాంతాలను బట్టి వేతనాల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ ఆధారిత అంకుర సంస్థలు, ప్రపంచ సామర్థ్య కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో బెంగళూరు దేశంలో అత్యధిక వేతనాలు అందించే మార్కెట్‌గా కొనసాగుతోంది. అక్కడ సీనియర్ ఏఐ నిపుణులు ఏటా రూ.61.70 లక్షల నుంచి రూ.91.25 లక్షల వరకు పొందుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, ముంబైతో పోలిస్తే ఇది దాదాపు 10 నుంచి 15 శాతం అధికం. సీనియర్ స్థాయిలో చెన్నైతో పోలిస్తే 40 శాతం వరకు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది.

### బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీ

ఏఐ ఉద్యోగాల విషయంలో హైదరాబాద్ కూడా వేగంగా దూసుకొస్తోంది. నగరంలో ప్రపంచ సామర్థ్య కేంద్రాల విస్తరణ, ఉత్పత్తి ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడులతో ఏఐ నిపుణులకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. దీంతో అత్యధిక వేతనాల మార్కెట్‌గా ఉన్న బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీదారుగా ఎదుగుతోందని నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీ రంగంలో అత్యధిక వార్షిక వేతన పరిమితి రూ.97.81 లక్షలకు చేరింది. పరిశీలించిన విభాగాలన్నింటిలో ఇదే అత్యధికమని తెలిపింది. ఐటీ సేవల రంగంలో మాత్రం ప్రారంభ వేతనాలు రూ.2.68 లక్షల నుంచి రూ.5.08 లక్షల మధ్య ఉండగా.. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి రూ.57.55 లక్షల నుంచి రూ.72.13 లక్షల వరకు ఉన్నట్లు పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ విభాగంలో వేతనాలు ఒక శాతం తగ్గినట్లు నివేదిక వెల్లడించింది. ఉద్యోగుల అనుభవం కంటే సంస్థలకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలకే ఇప్పుడు అధిక విలువ లభిస్తోందని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా పేర్కొన్నారు. ఏఐ వ్యవస్థల నిర్మాణం, సాంకేతిక మౌలిక సదుపాయాల భద్రత, పరిశ్రమల ఆటోమేషన్, ప్రత్యేక ఆరోగ్య సేవలు వంటి రంగాల్లో నైపుణ్యం ఉన్నవారికి సంస్థలు అధిక వేతనాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. వ్యాపార అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకునే వారి వేతనాలు మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఏఐతో పాటు ఇతర నూతన సాంకేతిక రంగాల్లోనూ వేతనాలు పెరుగుతున్నాయి. గత రెండేళ్లలో సెమీకండక్టర్ రంగంలో వేతనాలు 17 శాతం, పారిశ్రామిక ఆటోమేషన్‌లో 13 శాతం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. పారిశ్రామిక ఆటోమేషన్‌లో సీనియర్ ఉద్యోగుల వార్షిక ప్యాకేజీ రూ.58.90 లక్షలకు, సెమీకండక్టర్ రంగంలో రూ.48.49 లక్షలకు చేరింది. ఆటోమొబైల్ రంగంలో గత ఏడాది 6 శాతం వేతన వృద్ధి నమోదైంది. వైద్య సేవల రంగంలో 8 శాతం పెరుగుదలతో సీనియర్ వేతనాలు రూ.56.70 లక్షలకు చేరాయి. వైద్య పరికరాల రంగంలో 6 శాతం, ఔషధ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. మొత్తంగా ఉద్యోగ మార్కెట్‌లో 'అనుభవం ఎంత?' అన్న ప్రశ్న కంటే 'నైపుణ్యం ఏమిటి?' అన్నదే కీలకంగా మారుతోంది. ఏఐ వినియోగం ఇదే వేగంతో విస్తరిస్తే.. ఆ రంగంలో నిరంతరం కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకునే నిపుణులకు అవకాశాలు, ఆదాయంలో తిరుగుండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నింగిలోకి ఈవోఎస్-05

- ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!
- శ్రీహరికోట నుంచి ప్రయోగం
- భూస్థిర కక్ష్యలో పనిచేయనున్న ఇమేజింగ్ శాటిలైట్
- భారత ఉపఖండంపై నిరంతర పర్యవేక్షణ
- విపత్తులు.. వ్యవసాయం.. జలవనరులపై కీలక సమాచారం
- ఐదేళ్ల క్రితం విఫలమైన మిషన్‌కు ప్రత్యామ్నాయం



రంగాలకు ఉపయోగపడే ఈవోఎస్-05 ప్రయోగంతో భారత భూపరిశీలన సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

**శ్రీహరికోట, సెప్టెంబర్ 4 :**భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. భూస్థిర కక్ష్య నుంచి పనిచేసే భారత ఇమేజింగ్ ఉపగ్రహంగా ఇది కీలక పాత్ర పోషించనుంది. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. భూమి భ్రమణానికి అనుగుణంగా ప్రయాణిస్తూ భారత ఉపఖండం, పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించే సామర్థ్యం దీనికి ఉంటుంది. తక్కువ ఎత్తులోని కక్ష్యల్లో తిరిగే ఉపగ్రహాలతో పోలిస్తే ఒకే ప్రాంతాన్ని తరచూ పరిశీలించే అవకాశం ఈవోఎస్-05కు ఉండటం ప్రధాన ప్రత్యేకత.

### ప్రతి అరగంటకోసారి భారత్ చిత్రం

ఈవోఎస్-05 ప్రతి 30 నిమిషాలకు భారత భూభాగాన్ని చిత్రీకరించే సామర్థ్యంతో రూపొందించినట్లు పేర్కొన్నారు. తుఫానులు, వరదలు, అడవి కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులను పర్యవేక్షించడంతో పాటు వాతావరణ మార్పులను గమనించేందుకు ఇది ఉపయోగపడనుంది. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణతో పాటు వ్యూహాత్మక అవసరాలకు కూడా ఈ ఉపగ్రహ సమాచారం కీలకం కానుంది.

### 2021 వైఫల్యానికి విజయంతో సమాధానం

ఇలాంటి లక్ష్యాలతోనే 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ఈవోఎస్-03 ఉపగ్రహాన్ని ప్రయోగించగా సాంకేతిక సమస్య కారణంగా ఆ మిషన్ విజయవంతం కాలేదు. ఆ తర్వాత చేపట్టిన తాజా మిషన్ విజయవంతం కావడంతో ఇస్రో కీలక మైలురాయిని అందుకుంది. ప్రస్తుతం ఈవోఎస్-05ను భూస్థిర బదిలీ కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు ఇస్రో తెలిపింది. ఉపగ్రహంలోని సౌర ఫలకాలు తెరుచుకుని పనిచేస్తున్నాయని పేర్కొంది. రానున్న రోజుల్లో దశలవారీగా కక్ష్యను పెంచుతూ తుది భూస్థిర కక్ష్యలోకి తీసుకెళ్లనున్నారు. భూమిపై విపత్తుల పర్యవేక్షణ నుంచి వ్యవసాయం, జలవనరుల నిర్వహణ వరకు అనేక రంగాలకు ఉపయోగపడే ఈవోఎస్-05 ప్రయోగంతో భారత భూపరిశీలన సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

## భారత అంతరిక్ష సామర్థ్యాలపై విదేశాంగ శాఖ హర్షం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 ::** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) హర్షం వ్యక్తం చేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన ఈ రాకెట్, దేశంలోనే తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన 'ఈవోఎస్-05' (ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-05)ను కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ చరిత్రాత్మక విజయం భారత్‌కు ఎంతో గర్వకారణమైన క్షణమని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కొనియాడారు. ఇస్రో సాంకేతిక సామర్థ్యాలతో పాటు భారతీయ పరిశ్రమలతో పెరుగుతున్న భాగస్వామ్యానికి ఈ విజయం నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తొలి జియో-ఇమేజింగ్ ఉపగ్రహం ప్రయోగం సక్సెస్ కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

## అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:** జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.



# మహిళపై లైంగిక దాడి యత్నం..
# అడ్డుకున్న వీధికుక్క!

**కోయంబత్తూరులో వెలుగులోకి వచ్చిన ఘటన**

**మహిళ కేకలకు స్పందించిన శునకం**


**కోయంబత్తూరు, సెప్టెంబర్ 4 :**మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళపై 17 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి యత్నించగా.. సమీపంలో ఉన్న వీధికుక్క అడ్డుకుని ఆమెను కాపాడిన ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా.. మహిళను రక్షించిన శునకంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. కోయంబత్తూరు సమీపంలోని తుడియలూరు రైల్వే ఓవర్‌బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. రోడ్డు పక్కన ఓ మహిళ వీధికుక్క సమీపంలో కూర్చుని ఉండగా.. మద్యం మత్తులో ఉన్నట్లు చెబుతున్న 17 ఏళ్ల బాలుడు అక్కడికి వచ్చాడు. తొలుత కుక్కను అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించిన బాలుడు అనంతరం మహిళపై లైంగిక దాడికి యత్నించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆ సమయంలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వీధికుక్క వెంటనే స్పందించింది. బాలుడిపైకి దూసుకెళ్లి అతని కాళ్లను కరిచింది. దీంతో భయపడిన బాలుడు అక్కడి నుంచి పరుగులు తీయగా.. కుక్క కొంతదూరం వరకు తరిమినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి అదే రోజు బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరచగా అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో మహిళను కాపాడిన వీధికుక్క చర్యపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించిన శునకం వల్లే మహిళ మరింత ప్రమాదం నుంచి బయటపడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో మహిళల భద్రత, బలహీన వర్గాల రక్షణపై మరింత అప్రమత్తత అవసరమన్న చర్చ కూడా ఈ ఘటనతో మళ్లీ ముందుకొచ్చింది.

# ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

**జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్**

**దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు**

**ఢిల్లీ, సెప్టెంబర్ 4 :**దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయ-మైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.





# ఘనంగా శ్రీ కాత్యాయని సమేత సిద్దేశ్వర స్వామి ప్రతిష్ట

## ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
సిద్దిపేట పట్టణంలో శ్రీ కాత్యాయని సమేత సిద్దేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, ఐక్యతను పెంపొందించడంలో ఎంతో కీలకమని వంగ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## ఆకట్టుకున్న చిన్నారుల కృష్ణ, గోపిక వేషధారణలు

## కృష్ణమయంగా మారిన సరస్వతి గ్లోబల్ స్కూల్

## ఉట్టి కొట్టి అలరించిన చిన్ని కృష్ణులు



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సరస్వతి గ్లోబల్ స్కూల్ లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణతో పాఠశాల ప్రాంగణమంతా కృష్ణమయంగా మారింది.ప్రతి పండుగ విశిష్టతను చిన్నారులకు నేరుగా తెలియజేసేందుకే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం కృష్ణ అవతారంలో ఉన్న చిన్నారులు, గోపికలు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టిని పగలగొట్టి సంబరాలు చేసుకున్నారు. చిన్ని కృష్ణుల వేషంలో ఉన్న చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రమణ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం




**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
శాసనమండలి ఉపనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎలగందుల రమణ 65వ జన్మదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణ 7వ వార్డు కౌన్సిలర్ కోరుకంటి రాము ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోరుకంటి రాము మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా కళాశాల యూనియన్ ప్రెసిడెంట్ స్థాయి నుండి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ, ఎమ్మెల్యే, ఖాదీ బోర్డు చైర్మన్ మరియు మంత్రిగా ప్రజాసేవలో ముద్ర వేసిన రమణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలోని అత్యవసర రోగులకు రక్త కొరత లేకుండా సహాయపడాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ శిబిరంలో బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దయ్యాల మల్లారెడ్డి, మండల నాయకులు పులి మల్లేశం గౌడ్, ఆసుపత్రి వైద్య సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలలో గెలుపు ఓటములు సహజం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 04, :**
గత రెండు రోజులుగా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల స్థాయిలో నిర్వహించిన పాఠశాల క్రీడల పోటీలలో గెలుపొందిన జట్లకు శుక్రవారం బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ప్రవీణ్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుందని, జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను తట్టుకునే శక్తి లభిస్తుందని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పదిహేడేళ్ల లోపు బాలుర విభాగంలో కబడ్డీ, ఖో–ఖో పోటీలలో అల్వాల సంక్షేమ గురుకుల పాఠశాల, వాలీబాల్ పోటీలో మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల మొదటి బహుమతి గెలుచుకోగా, పద్నాలుగేళ్ల లోపు విభాగంలో కబడ్డీలో కొండాపూర్ ఉన్నత పాఠశాల, ఖో–ఖోలో అల్వాల సంక్షేమ గురుకుల పాఠశాల, వాలీబాల్ లో మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. బాలికల పదిహేడేళ్ల లోపు విభాగంలో వాలీబాల్, ఖో–ఖో పోటీలలో మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల, కబడ్డీలో అందె ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. అలాగే ద్వితీయ బహుమతుల విభాగంలో పదిహేడేళ్ల లోపు



బాలుర కబడ్డీలో మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల, ఖో–ఖో, వాలీబాల్ లో మిరుదొడ్డి ఉన్నత పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి సముదాయ ప్రధానోధ్యాయుడు వెంకట రామలింగం, చేప్యాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, అల్వాల గురుకుల ప్రధానాచార్యుడు రవీందర్ తో పాటు ఉపాధ్యాయులు రామచంద్రం, కృష్ణ, మహేందర్, బద్ది రాజు, లక్ష్మణ్, దేవరాజు, వెంకట్ రెడ్డి, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 04, :**
అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని మాజీ సీఎం, ఎమ్మెల్యే కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని చిన్నకోడూరు ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అల్లిపూర్ శివారులోని అంతగిరి రిజర్వాయర్ కట్ట మైసమ్మ దేవాలయం నుంచి చిన్నకోడూరు అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అల్లిపూర్, కమ్మర్లపల్లి, మైలారం, సలింద్రి గ్రామాల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పాలనలో



జరిగిన అవినీతి, అక్రమాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు జరిగిన నష్టంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందుం చింద న్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకా కుండా ప్రజా సొమ్మును జీతంగా తీసుకుంటున్నారని ఆరో పించారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే దూరంగా ఉంటున్నారని విమర్శించారు.హరీష్‌రావు 22ఏ భూముల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారని, గతంలో జరిగిన భూ వ్యవహారాలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ వద్ద ఉన్న ఆధారాలతో కలెక్టర్, ఉన్నతాధికారులను కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. రైతులు, యువతను రాజకీయ ప్రయోజ నాల కోసం రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి కాల్వ నరేష్ కోరారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ ఎలుక దేవయ్య సూచనల మేరకు హమారా ప్రసాద్‌పై దుబ్బాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాల్వ నరేష్ మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయులని అన్నారు. రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ నిర్మాత పట్ల అవమానకరంగా మాట్లాడే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేలా లేదా ప్రజల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లయితే పోలీసులు ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, విచారణలో నేరం నిర్ధారణ అయితే వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు




నాయకులు ఆస ముత్యం, బావాజీ రమేష్, ఐత స్వామి, లచ్చపేట నర్సింలు, బావాజీ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 7న ఖమ్మం వీఎచ్పీఎస్ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
సెప్టెంబర్ 7న ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న వీఎచ్పీఎస్ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వీఎచ్పీఎస్ సిద్దిపేట జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ఇన్‌చార్జి ముక్కపల్లి కనకరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎంఎస్పీ జిల్లా కో–ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి మాదిగ, వీఎచ్పీఎస్ జాతీయ నాయకులు దండు శంకర్, ఎంఆర్పీఎస్ సిద్దిపేట జిల్లా కన్వీనర్



ముక్కపల్లి రాజు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఖమ్మం తరలివెళ్లాలని కోరారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, వీఎచ్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జేరిపోతుల లక్ష్మణ్, వీఎచ్పీఎస్ రాష్ట్ర నాయకులు సమ్మయ్య, కేమ్మసారం అశోక్, యాదగిరి, శ్రీనివాస్, దేవదానం, రాజిరెడ్డి, పిడిశెట్టి నారాయణ, రాజేశ్వర్‌రావు, పుష్పమ్మ, సురేష్, కనకరాజు, జంగారెడ్డి, స్వామి, రాజేష్, అరుణ్, రాంచంద్రం, అంజిరెడ్డి, చంద్రయ్య, బూరుగుపల్లి స్వామితో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యానికేతన్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- **ఆటపాటలతో సందడి చేసిన చిన్నారి విద్యార్థులు**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04, :** శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని రోడా మేస్త్రినగర్ డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్గ్‌లో ఉన్న శ్రీ సాయి చైతన్య విద్యానికేతన్ పాఠశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమాన్ని ట్రస్మా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ లయన్ బిర్రు ఆంజనేయులు, డైరెక్టర్ బిర్రు శోభారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేలా పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం, సృజనాత్మకతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంతి, ప్రసన్న, కృష్ణవేణి, అన్నే




ఫాతిమా, సరళ సుభాషిణి, మహేశ్వరి, షాహిన్ సాజిత్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా

- **హెచ్‌ఎంటీ గ్రౌండ్స్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహణ**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
చింతల్ గోకుల్ యాదవుల ఆధ్వర్యంలో హెచ్‌ఎంటీ గ్రౌండ్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ హాజరై శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భరతనాట్యం విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన నృత్య ప్రదర్శనలను వీక్షించిన జే.కే. శేఖర్ యాదవ్, విద్యార్థుల ప్రతిభను అభినందించి వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ముదిరాజ్ సమాజ చైతన్యానికి కొరివి కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం

- మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
ముదిరాజ్ సమాజ చైతన్యానికి, హైదరాబాద్ నగర అభివృద్ధికి కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయ మని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా శుక్రవారం ముదిరాజ్ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణస్వామి ముదిరాజ్ రచయితగా, పాత్రికే యుడిగా, ప్రచురణకర్తగా, విద్యావే త్తగా, సామాజిక సంస్కర్తగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, హైదరాబాద్ మేయర్‌గా ప్రజలకు సేవలందించారని తెలిపారు. 1894లో ఔరంగాబాద్‌లో జన్మించిన కృష్ణస్వామి ముదిరాజ్ సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నారని అన్నారు. చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్, నిజాం కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను అభ్య సించిన ఆయన, ముద్రణ-ప్రచురణ రం గంలో శిక్షణ పొందేందుకు బొంబాయికి వెళ్లారని తెలిపారు. విద్య, సామాజిక చైతన్యం, ముదిరాజ్ సమాజ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రచయితగా హైదరాబాద్ చరిత్రను భద్రపరిచిన ఆయన, పాత్రికేయుడిగా ప్రజల్లో చైతన్యం కలిగించారని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా దశాబ్దాల పాటు సేవలందించి, 1957-1958లో హైదరాబాద్ మేయర్‌గా నగరానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. ముదిరాజ్ సమాజం విద్య, ఐక్యత, స్వాభిమానం, సామాజిక ప్రాతినిధ్యం సాధించేందుకు కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర యువజన అధ్యక్షులు పడిగే ప్రశాంత్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, పాల సాయిరామ్, మచ్చ వేణుగోపాల్, అనగొని లింగం గౌడ్, బత్తుల చంద్రం, తేల్జేరు శ్రీనివాస్, బర్ల మల్లికార్జున్, రెడ్డి యాదగిరి, పాత్రికేయ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ (ఆర్కె), పరమేశ్వర్, సత్తీష్, రేగుల దేవయ్య, రావుల రాజు, మరుపల్లి శ్రీనివాస్ గౌడ్, టైగర్ సత్తి, బోనాల శ్రీనివాస్, కుంబాల ఎల్లారెడ్డి, సాతారాజుపల్లి ఆంజనేయులు, యాట రాజేష్, డిష్ రాజు, తోటల పరశురాములు, కొంతం శ్రావణ్, దూలం ముత్యం, ప్రభూ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్‌రావు హయాంలోనే సిద్దిపేట అభివృద్ధి

- కాంగ్రెస్ పాలనలో పట్టణ ప్రగతి కుంటుపడింది
- బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు షాహిద్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
సిద్దిపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు కృషి కీలకమని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు, సిద్దిపేట టౌన్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ షాహిద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే నేటికీ పట్టణ ప్రగతికి పునాదులుగా నిలిచాయని అన్నారు. హరీష్‌రావు హయాంలో సిద్దిపేట పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని షాహిద్ తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట మున్సిపాలిటీలో చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. పట్టణ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనేక వార్డుల్లో డిపాజిట్లు కూడా దక్కవని షాహిద్ జోస్యం చెప్పారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టే సమయం ఆసన్నమైందని, సిద్దిపేట మున్సిపాలిటీని తిరిగి బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ప్రజల మద్దతుతో పట్టణ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.

# మహిళల ఉసురు ఊరికే పోదు

## బీఆర్ఎస్ నేతల ఫైర్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ జడ్పీ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు ఆరోపించారు. శుక్రవారం సిద్దిపేట వెంకటేశ్వర దేవాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మహిళలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి 33 నెలలుగా బకాయి పెట్టారని, ఒక్కొక్క మహిళకు రూ.82,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, విద్యార్థినులకు




స్కూటీలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారని, తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. పథకాన్ని కొనసాగించి, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, రాష్ట్ర నాయకులు ఎల్లు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గుండు భూపేష్, మారెడ్డి రవీందర్‌రెడ్డి, మోహన్‌లాల్, జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సారయ్య, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# విధ్వంసానికి చిరునామా రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన

- పేదల సొంతింటి కలను సాకారం చేసింది కేసీఆరే: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- డబుల్ బెడ్రూం లబ్ధిదారులను నోటీసుల పేరుతో వేధిస్తే సహించేది లేదు
- నీటి బిల్లుల మాఫీకి కృషి.. సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి పర్యటన

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 04, :**
ప్రజలు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం అప్పగిస్తే.. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ విధ్వంస పాలన కొనసాగిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీలు, మోసాలపై బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా శుక్రవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం ఫేస్-2లో తాగునీరు, విద్యుత్, బస్తీ దవాఖానా తదితర సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 38 వేల డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. పేదల కోసం సుమారు 600 ఎకరాల భూమిని సమీకరించి, కేవలం మూడేళ్లలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడం ఆషామాషీ విషయం కాదని, కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.



### నోటీసుల పేరుతో వేధిస్తే సహించేది లేదు

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను నోటీసుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కొత్తగా వచ్చిన అధికారులు, సిబ్బంది పేరుతో లబ్ధిదారులను వేధిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తామని, అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉండే కుటుంబ సభ్యుడిగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### నీటి బిల్లుల మాఫీకి కృషి

కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం సముదాయంలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు నీటి బిల్లుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాలనీలో అవసరమైన కొత్త డ్రైనేజీ వ్యవస్థ, ఎస్‌టీపీ పనులకు సంబంధించిన ప్రణాళికలను పునరుద్ధరించి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు.అతి త్వరలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రతి బ్లాకులో పర్యటించి సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### వచ్చేది మన ప్రభుత్వమే

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన కేసీఆర్ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అవసరమైన సమయంలో ప్రజలు తమ శక్తిని చూపించాలని పిలుపునిచ్చారు.పేదల సంక్షేమాన్ని విస్మరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడల్లో ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థుల సత్తా



**చిన్నకోడూరు, సెప్టెంబర్ 04, :**
పాఠశాల క్రీడా సమైక్య-2026లో భాగంగా ఈ నెల 2, 3 తేదీల్లో చిన్నకోడూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. అండర్-14, అండర్-17 వాలీబాల్ బాలికల విభాగాల్లో ప్రథమ స్థానం, బాలుర విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలోనూ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ పి సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి, విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ గుండి ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మండల స్థాయి పోటీల్లో విజయం సాధించిన 20 మంది క్రీడాకారులు ఈ నెలలో సిద్దిపేట జిల్లాలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బాపూజీ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జగద్గిరిగుట్ట పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో గల బాపూజీ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం చిన్నారి విద్యార్థుల కేరింతల నడుమ ఉత్సాహంగా జరిగాయి. పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు భారతీయ పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలు, వాటి విశిష్టతలను తెలియజేసేందుకు పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీకృష్ణుడు, రాధమ్మ, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేస్తూ చూపరులను మంత్రముగ్ధులను చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** మేడ్చల్ అర్బన్ జిల్లా షాపూర్‌నగర్ కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలతో పాటు తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని భగవంతుడిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి 'రైతు పోలికేక'ను విజయవంతం చేయాలి

## హబ్సిపూర్ చౌరస్తాలో ధర్నా
## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని, ప్రభుత్వంకు వ్యతిరేకంగా శనివారం నిర్వహించ తలపెట్టిన రైతు పోలికేక ను విజయవంతం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దుబ్బాక మండలం హబ్సిపూర్ చౌరస్తాలో మహా ధర్నా కు నియోజకవర్గం లోని అన్ని మండలాలకు చెందిన రైతులు, బిఆర్ఎస్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నా వ్యతిరేక విధానాల ఎండగట్టాలని అన్నారు. ఇట్టి ధర్నా కార్యక్రమంకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తో పాటు ముఖ్య నేతలు హాజరు అవుతారని తెలిపారు.



# కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**పరకాల ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** దామెర మండలం కేంద్రంలో నిర్మిస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను శుక్రవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. డెయిరీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, స్థల పరిస్థితులు, రహదారి సౌకర్యం తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్-సంతోషిమాత ఆలయంలో వెలిచాల రాజేందర్‌రావు ప్రత్యేక పూజలు



**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్‌లో ఉన్న హనుమాన్–సంతోషిమాత ఆలయాన్ని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన కరపత్రాన్ని రాజేందర్‌రావు ఆవిష్కరించారు. ఆలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తూ అవసరమైన కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ధర్మారం వెంకటస్వామి, మాజీ కార్పొరేటర్ వాల రమణారావు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంగాపూర్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగష్టు 29, :** గంగాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వోల్వోజీ వెంకటేశం చారి, ఉప సర్పంచ్ లెండుగురే ఇస్తారి, ఏఎస్ఐ నారాయణ ఆధ్వర్యంలో వేడుకలను ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణాష్టమి పండుగ ప్రత్యేకతను, శ్రీకృష్ణుడి పండుగ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ముఖ్య అతిథులు సంప్రదాయబద్ధంగా ఆటను ప్రారంభించారు. ఆట ప్రారంభమైన అనంతరం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా ఆటను ఆడారు. చిన్నారులు, యువత, సహా గ్రామస్తులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. దీంతో గంగాపూర్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

# చిన్నారి అగస్త్య నారాయణ్ తొలి పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** గాజులరామారం సత్య గౌరీ కన్వెన్షన్ హాల్‌లో సూరారం 129వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మనవడు చిన్నారి మంత్రి అగస్త్య నారాయణ్ తొలి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేషన్ సభ్యులు బాలమల్లు హాజరై చిన్నారి అగస్త్య నారాయణ్‌ను ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# దుబ్బాకలో "కొత్త"గా "రఘు"లుతున్న రాజకీయం

## ఆ 'ఇద్దరి' కోసమే వీరు కలిసిపోయారా

- అవును 'వాళ్ళిద్దరు' 'ఒక్కటయ్యారు' అంటున్న 'స్థానికు'లు
- 'వ్యూహాత్మక' కలయికగా భావిస్తున్న దుబ్బాక ప్రజలు
- అభివృద్ధి కోసం ఎమ్మెల్యే, ఎంపీ 'ఒక్కటయ్యారా'
- వారి లక్ష్యం 'నియోజకవర్గ' అభివృద్ధా.. 'ప్రత్యర్థులకు' చెక్ పెట్టడమా..







**సిద్దిపేట జిల్లా ప్రతినిధి (చేపూరి సత్యనారాయణ గౌడ్), సెప్టెంబర్ 04, :** రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు అనే నానుడి ఉంది. చదరంగాన్ని మించిన ఈ రాజకీయ ఆటలో చివరికి వ్యూహాత్మక నేర్పరే గెలుస్తారు. ఇదే సూత్రం ఇప్పుడు సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో కొత్త చర్చకు తెరలేపింది. బిఆర్ఎస్ పాలనలో, గతంలో నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మధ్య విమర్శలు తారాస్థాయికి చేరాయి. అధికార కార్యక్రమాల్లో ఇరు పార్టీల కార్యకర్తల నినాదాలు, పరస్పర విమర్శలతో రాజకీయ వేడి రగిలేది. నాయకులు, కార్యకర్తలను అదుపు చేయడం పోలీసులకు తలకు మించిన భారంగా మారేది. కానీ ఇప్పుడు దుబ్బాకలో సీన్ రివర్స్ అయింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు అక్బర్ పేట-భూంపల్లి మండలంలో ఇటీవల జరిగిన ప్రారంభోత్సవాలకు ఒకే కారులో కలిసి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడంతో విభేదాలకు ఫుల్ స్టాప్ పడినట్లయింది. ఈ ఊహించని పరిణామంతో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు ఒకింత షాక్ కు గురయ్యారు. ప్రజలు మాత్రం గొడవలు, విమర్శలు లేకుండా అభివృద్ధి పనులకు పునాదులు పడ్డాయని విస్తృతంగా చర్చించుకున్నారు.

### ఈ కలయిక వెనుక ఆంతర్యం ఏంటి

ఒక్కసారిగా ఇద్దరు నాయకులు కలవడం వెనుక ఏదైనా వ్యూహం దాగి ఉందా.. మరొకటి ఉందా అనే చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. రాజకీయ చదరంగంలో వారికి పోటీగా తయారైన ఇతర నాయకులు ఎదగకుండా చేసే కుట్రలో భాగమే ఈ కలయిక అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సోలిపేట రామలింగారెడ్డి వర్ధంతి వేడుకల్లో రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాత రాబోయే ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ ప్రకటనే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి యూటర్న్ తీసుకొని ఎంపీ మాధవనేని రఘునందన్ రావుతో స్నేహానికి బీజం వేసిందా అనే చర్చ నియోజకవర్గంలో విస్తృతంగా వినిపిస్తోంది. గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాధవనేని రఘునందన్ రావును అధికార బీఆర్ఎస్ నేతలు తన్నీరు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రోటోకాల్ విషయంలో తీవ్రంగా అవమానించారు. ప్రస్తుతం ప్రతీకారం కాకుండా అభివృద్ధి కోసం చేతులు కలపడం శుభపరిణామమే అయినా, అది ఎంతవరకు నియోజకవర్గ ప్రజల కోసం అనే సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీని పుంజుకోకుండా చేయడంతో పాటు సొంత పార్టీలో వర్గపోరు, సెకండ్ క్యాడర్ లేకుండా చేయడానికి ఇది ఒక కొత్త ఎత్తుగడ అంటూ కొందరు గుసగుసలు పెట్టుకుంటున్నారు.

### ఇద్దరికీ ఒకేసారి వ్యూహాత్మకంగా చెక్

ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నడవడం వెనుక బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తానంటున్న సోలిపేట సుజాత, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీకి సిద్ధమవుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు ఒకేసారి చెక్ పెట్టేందుకే ఈ వ్యూహాత్మక ఎత్తుగడ అనే ప్రచారం నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది. వారిద్దరినీ నియోజకవర్గంలో ఎదగకుండా చేయడానికే ఇద్దరు పెద్ద నాయకులు ప్లాన్ చేశారనే చర్చ జోరుగా సాగుతోంది. "పదవుల్లో ఉన్న మనం కొట్లాడితే ప్రత్యర్థులకు మేలు" చేకూరుతుందనే కోణంలో కలిసారనే వాదన కూడా బాగానే వినిపిస్తుంది. ఏదేమైనా రాబోయే ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందే దుబ్బాక నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కలిసిపోయిన 'మాధవనేని–కొత్త'ల ఎత్తులు పైఎత్తులతో వర్గపోరుకు బీజం వేసే ప్రత్యర్థి నాయకులకు చుక్కలు తప్పవా అని పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. ఇక మూడు పార్టీల అధిష్టానం ఎలా స్పందిస్తుందో, ఎవరికి మద్దతు ఇస్తుందో వేచిచూడాల్సిందే.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

- వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దర్ పాత్ర కీలకమైందని అలాంటి గద్దర్ ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బీసీ జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట లో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై సంబరాలు



**దమ్మపేట, సెప్టెంబర్ 04, :** తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దమ్మపేట మండల కేంద్రంలో స్థానిక వై.ఎస్.ఆర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు కేకు తినిపించుకుంటూ జై కాంగ్రెస్, జై జై కాంగ్రెస్ అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, అర్హులైన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ అమలు, రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థిక సహాయం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, వైద్య ఖర్చుల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు పెంపు, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర జారీ, గ్రామాల్లో మౌళిక వసతులు, ప్రభుత్వ ఉద్యోగాల అవకాశం కల్పన తదితర కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాల వివరాలు వెల్లడించారు. దమ్మపేట మండల కేంద్రంలో శుక్రవారం బి.ఆర్.ఎస్ నాయకులు మంత్రి సతీమణి పై చేసిన బి.ఆర్.ఎస్ కు పంచాయతీ ఎన్నికలలో ఓటు వేయమన్న ఆరోపణ అవాస్తవము అని, రాజకీయాలకు దూరంగా ఉండి, సంబంధం లేని మహిళ పై దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటు అని దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కాసాని నాగప్రసాద్ ఖండించారు. జై భట్టి, జై తుమ్మల, జై పొంగులేటి, జై జారే అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పగడాల రాంబాబు, కే.వి. సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకట రామారావు, చిన్నశెట్టి చిట్టిబాబు, గోపి, వనమాల శ్రీనివాసరావు, పగడాల కృష్ణారావు, దేవయ్య, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, వేముల శ్రీను, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు, ఎస్.కే రషీద్, రఫీ, జెట్టి వెంకటేశ్వరరావు, సుధాపల్లి నాగరాజు, అన్నవరపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ మహాలక్ష్మి అలంకరణలో గాయత్రీ అమ్మవారు

- దమ్మపేట పంచాయతీ మహిళా సిబ్బందిని ఆశ్రమంకు ఆహ్వానించి తాంబూలం ఇచ్చి దైవానుగ్రహం కలగాలి అని ఆశీర్వదించిన ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ ప్రేమ్ సుస్థిర దంపతులు



**దమ్మపేట, సెప్టెంబర్ 04, :** దమ్మపేట మండల కేంద్రంలో గల శ్రీ గాయత్రీ ఆశ్రమం నందు గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా భక్తులకు మనశ్శాంతి, జ్ఞానం, విద్య లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం ఉంది. శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రావణ 4 వ శుక్రవారము కావున గాయత్రీ అమ్మవారిని మట్టి గాజులతో శ్రావణ మహాలక్ష్మిగా అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మపేట పరిసర గ్రామాల నుండి వచ్చిన భక్తులతో ఆశ్రమం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ, రమణి దంపతులు గాయత్రీ దేవి అమ్మవారి వాయనము చీర, తాంబులము, గాజులు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఇచ్చి మీరు, మీ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ జ్ఞానస్వరూపిణి మీ అందరికీ ఆయురారోగ్యాలను, సద్బుద్ధిని, ప్రశాంతతను ప్రసాదించాలని దీవించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సుస్థిర గురూజీ మాట్లాడుతూ జ్ఞానానికి ప్రతీక అయిన గాయత్రీ దేవిని ఐశ్వర్య ప్రదాత అయిన మహాలక్ష్మి రూపంలో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయి అన్నారు. ప్రతీ పండుగకు ఆశ్రమము నందు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సుకు, పేదరిక నిర్మూలనకు మరియు మానవతా విలువలను పెంపొందించలని ఉద్దేశ్యంతో నేడు పంచాయతీ సిబ్బందిని ఆశ్రమంకు ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది అని, వారు నిరంతరం గ్రామ స్వచ్ఛతను పరిరక్షిస్తూ, పారిశుధ్య పనులను నిర్వహిస్తూ, మొక్కలను పెంచుతూ, ప్రజల వద్ద నుండి చెత్త సేకరిస్తూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందిని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంకు సహాయ సహకారాలు అందిస్తున్న సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సేవకులు, గాయత్రి పుత్రికలు పాల్గొన్నారు.

# మైనారిటీ డిక్లరేషన్ ఏమైంది

- కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు చేసిందేమిటో నిరూపించాలి
- బీఆర్ఎస్ నాయకుల ప్రశ్న



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మైనారిటీ డిక్లరేషన్ ఏమైందని బీఆర్ఎస్ మైనారిటీ సీనియర్ నాయకులు అతీక్ అహ్మద్, లయిక్, అజ్జు ప్రశ్నించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మైనారిటీల కోసం ఏమీ చేయలేదని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హరీశ్‌రావు మైనారిటీ కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. ఆయన హయాంలో హజ్ హౌస్ నిర్మాణం, మదీనా ఫంక్షన్ హాల్‌లో క్రాకరీ కోసం సొంతంగా నిధులు ఖర్చు చేయడం, ఎన్సాన్‌పల్లిలో ముస్లిం శ్మశానవాటిక కోసం మూడు ఎకరాల స్థలం కేటాయించడం వంటి పనులు జరిగాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో షాదీ ముబారక్ పథకం ద్వారా అనేక కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, సిద్దిపేట మైనారిటీ నిరుద్యోగులకు రూ.లక్ష సబ్సిడీ రుణాలను 250 మందికి పైగా అందించామని పేర్కొన్నారు. మైనారిటీల కోసం చేసిన అభివృద్ధి పనులను చెప్పుకుంటూ పోతే సమయం సరిపోదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా మైనారిటీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మత ఘర్షణలు జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు తమ సవాల్‌ను స్వీకరించి, మైనారిటీల కోసం అమలు చేసిన పథకాలపై చర్చకు రావాలని కోరారు. ఈ సమావేశంలో మొహమ్మద్ హబీబ్, జలీల్, షాదుల్ అజర్, ఫసి, మజ్హూహార్, లతీఫ్, ఇషాక్ అహ్మద్, షాదాబ్, మొహమ్మద్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# అతి పెద్ద 420లు.. బీఆర్ఎస్ నేతలే!

- లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం కట్టారు. చుక్కనీరు రాకుండా చేశారు
- పదేళ్లలో పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ అయినా ఇచ్చారా?
- బీఆర్ఎస్ బిజెపి నేతలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వారికి లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- దాదాపు 4 లక్షలు పూర్తి
- రాబోయే రోజుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం బ్రహ్మాండమైన అభివృద్ధి చేస్తుంది
- కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
బీఆర్ఎస్ నేతలే దేశంలో అతి పెద్ద 420లని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా, రైతులకు చుక్కనీరు అందించలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని ఆరోపించారు తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాజేందర్రావు పాల్గొన్నారు. ఇందిరా చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్ చౌక్, గాంధీ చౌక్, బాబు జగ్జీవన్‌రామ్ చౌక్ మీదుగా కోర్టు చౌరస్తా, అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విషప్రచారంపై తీవ్రంగా మండిపడ్డారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అయినా ఇచ్చిందా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు అందించే కార్యక్రమం కొనసాగుతోందని, ఇప్పటికే దాదాపు నాలుగు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడతలో మరో రెండు లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ.. రూ.22 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.బీఆర్ఎస్, బీజేపీ నేతలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాజేందర్‌రావు అన్నారు. రాబోయే రోజుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని స్పష్టం చేశారు. బీజేపీ నేతల పరిస్థితి అధ్వానంగా తయారైందని, "రాత్రి డీల్.. తెల్లారితే రీడీల్" అంటూ ఆ పార్టీ నేతల తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, వేల్పుల వెంకటేష్, గసిగంటి కుమార్, కోడూరి రవీందర్‌గౌడ్, మిడిదొడ్డి కపిల్ మాధవ్, తిప్పారపు శ్రీనివాస్, రాచర్ల పద్మ, మాలోతు మహాలక్ష్మి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై షాపింగ్ మాల్ బిగెస్ట్ సేల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 04, :**
రామచంద్రాపురంలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో చెన్నై షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ బిగెస్ట్ సేల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటి హెబ్బా పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నటి హెబ్బా పటేల్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 4 నుంచి ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల విలువైన వస్త్రాలను ప్రత్యేక డిస్కౌంట్ ధరలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా తక్కువ ధరలకు నాణ్యమైన దుస్తులను అందించడం అభినందనీయమన్నారు. రామచంద్రాపురం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చెన్నై షాపింగ్ మాల్ డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ.. నగరంలో నిర్వహిస్తున్న తమ సంస్థకు ఇది 4వ ఎగ్జిబిషన్ అని తెలిపారు. షోరూమ్‌లకు వెళ్లి షాపింగ్ చేయడానికి సమయం, ప్రయాణం వంటి ఇబ్బందులు ఎదుర్కొనే వినియోగదారులకు వారు నివసించే ప్రాంతానికి సమీపంలోనే నాణ్యమైన వస్త్రాలను అందించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు.సెప్టెంబర్ 4 నుంచి 10 రోజుల పాటు రామచంద్రాపురంలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ బిగెస్ట్ సేల్ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని కృష్ణారావు తెలిపారు. మహిళలు, పురుషులు, చిన్నారులకు సంబంధించిన వివిధ రకాల వస్త్రాలు, విలువైన దుస్తులను ప్రత్యేక రాయితీ ధరలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. త్వరలో ఆర్‌సీ పురంలో మరో చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.వినియోగదారులకు మరింత చేరువగా వెళ్లి నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించడమే తమ సంస్థ లక్ష్యమని కృష్ణారావు పేర్కొన్నారు. రామచంద్రాపురం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ 10 రోజుల ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు నచ్చిన వస్త్రాలను డిస్కౌంట్ ధరలకు కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.




# కాంగ్రెస్ దగా పాలనపై జగద్గిరిగుట్టలో బీఆర్ఎస్ వంటా వార్పు

- హామీలు, గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద శుక్రవారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, వృద్ధులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ వంటి హామీలను నెరవేర్చాలని కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

- పట్టణంలోని మౌలిక వసతుల కల్పన అభివృద్దే లక్ష్యం

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
జగిత్యాల పట్టణ ఉప్పరిపెట్ లో వెలమ సంక్షేమ సంఘంలో 3 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి, బోర్ మోటార్ పనులకు భూమి పూజ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. అనంతరం హనుమాన్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు సరిత, రమేష్ రావు, దుమాల రాజ్ కుమార్, గిరిధర్, మాజీ ఏఎంసీ చైర్మెన్ దామోదర్ రావు, సంఘం అధ్యక్షుడు భగవంత రావు, నాయకులు దామోదర్ రావు, బాలే శంకర్, రమణ రావు, ఆనంద్ రావు రాజేశ్వర్ రావు, ప్రవీణ్ రావు, డిఈ మిలింద్, ఏఈ విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తపస్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**చొప్పదండి/కొడిమ్యాల: సెప్టెంబర్ 04, :**
కొడిమ్యాల మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గురువులకు జగిత్యాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. ఎంఈఓ ఐత శ్రీనివాస్, హరిత స్కూల్ అసిస్టెంట్ జెడ్పిహెచ్ఎస్ జి పద్మజారాణి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కొడిమ్యాల కాసర్ల శంకర్, ఎస్జిటి ప్రైమరీ స్కూల్, తిరుమలపూర్, రజిత, ఎస్జిటి ప్రైమరీ స్కూల్ రామారావుపేటలను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డిఇఓవో రాము చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటోతో శాలువా కప్పి సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మమ్ములను ఎంపిక చేసి, గౌరవించినందుకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులకు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదరావు, రాజేష్, కొడిమ్యాల మండలంలో పనిచేయుచున్న తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి వీరమల్ల వెంకటరమణ రావు, మండల అధ్యక్షులు ఏనుగు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజ గంగయ్య, నాయకులు రాజన్న, బొమ్మ సురేష్, తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్

- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
సారంగాపూర్ మండలం రంగపేట గ్రామంలో 11 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి, 56 లక్షలతో రంగపేట ఆలూరు వయా బతుకమ్మ కుంట ఫార్మేషన్ రోడ్డును ప్రారంభించిన జగిత్యాలఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. గ్రామానికి చెందిన బోయిని పల్లవి మల్లేష్, బెక్కం అనిత శ్రీనివాస్ ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్. కొనాపూర్ గ్రామంలో దొంగరి గంగవ్వ శంకర్ ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏదుల శేఖర్, ఎంపీడీవో నీరజ, ఎంపీవో సలీమ్, ఉప సర్పంచ్ నరేష్, పాక్స్ చైర్మెన్ గురునాథ మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లేశం, శేఖర్ గౌడ్, కోల శ్రీనివాస్, సర్పంచులు సొల్లు సురేందర్, అరుణ శేఖర్, రాధా రాజు, మేకల శేఖర్, మాధవి బాపిరాజు, జ్యోతి శ్రీనివాస్, రుశేంద్ర శంకర్ రెడ్డి, డిఈ మిలింద్, ఏఈలు, విశ్వేందర్, తిరుమల, గ్రామ నాయకులు తిరుపతి, సదానందం, చంద్రయ్య, వేణు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

**బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా వారి పక్షాన నిలిచి న్యాయం జరిగేలా కృషి చేస్తానని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలోని రెడీమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గత రెండేళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్న దిగంబర్‌కు జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రూ.65 వేల వేతనం రావాల్సి ఉంది. అయితే కంపెనీ యాజమాన్యం వేతనం చెల్లించకపోవడంతో సమస్యను తోటి కార్మికుల ద్వారా తెలుసుకున్న దిగంబర్.. రవిని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. దీనిపై వెంటనే స్పందించిన రవి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, కార్మికుడు దిగంబర్‌కు రావాల్సిన రూ.65 వేల పూర్తి వేతనాన్ని ఇప్పించారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో దిగంబర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, హక్కుల కోసం కార్మికులకు అండగా నిలుస్తానని రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్ లో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** ప్రగతి నగర్ డివిజన్‌లోని శ్రీనివాస నగర్ కాలనీలో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణ స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. వేడుకల్లో మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, టీచర్స్ సెల్ కో-కన్వీనర్ సుమన్ రావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రవి యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి యాదగిరి, చక్రధర్, బిల్డర్ సెల్ అధ్యక్షులు పద్మ ప్రసాద్, ప్రగతి నగర్ ప్రధాన కార్యదర్శి మదన్ గౌడ్, ఉపాధ్యక్షులు వేణుమాధవ్, బీజేవైఎం అధ్యక్షులు పవన్, సీనియర్ నాయకులు సతీష్ కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో యాదవ సంఘం ప్రతినిధులు, భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల సందడితో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# నూతన మొబైల్ టవర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**తీరనున్న కొండగట్టు అంజన్న భక్తుల సిగ్నల్ కష్టాలు**



**చొప్పదండి/కొండగట్టు, సెప్టెంబర్ 04, :** శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము కొండగట్టులో ఇండస్ టవర్స్ సంస్థ వారిచే ఏర్పాటు చేయబడిన నూతన మొబైల్ టవర్‌ను శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ మొబైల్ టవర్ అందుబాటులోకి రావడం ద్వారా దేవస్థానమునకు విచ్చేసే భక్తులకు, స్థానిక ప్రజలకు మెరుగైన మొబైల్ నెట్‌వర్క్, కమ్యూనికేషన్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దారం ఆదిరెడ్డి, ఆలయ ఈఓ అంజనా రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇండస్ టవర్స్ ప్రతినిధులు, ఆలయ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ టెంపుల్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 04, :** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ అత్తాపూర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మానవతా విలువలకు ప్రతీక అని మంత్రులు పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అందించిన సందేశాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని, శ్రీకృష్ణుడి బోధనలను ఆచరించాలని మంత్రులు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్‌ది దగాకోరు పాలన: కేపీ.వివేకానంద్, శంభీపూర్ రాజు

- **జగద్గిరిగుట్టలో 'వంటా వార్పు'తో బీఆర్ఎస్ నిరసన**
- **ఉద్యమ రోజులను తలపించిన మానవహారం**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్‌స్టాప్ వద్ద 'వంటా వార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్యఅతిథులుగా హాజరై నిరసనను ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతసేపు చేపట్టిన మానవహారం ఉద్యమ రోజుల్ని తలపించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించిందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను అమలు చేయలేదని అన్నారు. అలాగే వృద్ధులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కేపీ.వివేకానంద్, శంభీపూర్ రాజు అన్నారు. ప్రజా సమస్యలు, హామీల అమలుపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట జేఏసీ చైర్మన్ డాక్టర్ శివరాత్రి యాదగిరి, బీఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, ఉద్యమ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 130 గ్రాముల గంజాయి పట్టివేత

- **ఇద్దరు నిందితుల అరెస్ట్**
- **జుడీషియల్ రిమాండ్**




**ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** ఆసిఫాబాద్ నియోజకవర్గం రెబ్బెన బస్టాండ్ వద్ద 130 గ్రాముల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు మోటరోలా జి-35 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7 వేలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎస్సై ఎ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు రెబ్బెన బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేయగా వారు జక్కులపల్లి గ్రామానికి చెందిన ధాగం సందీప్ (24), మంచిర్యాల కు చెందిన కొండగుర్ల రాజేందర్ ప్రసాద్ (19) గా గుర్తించారు. సందీప్ వద్ద ఉన్న పాలిథిన్ కవర్‌లో 130 గ్రాముల గంజాయి లభించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను విచారించగా మహారాష్ట్రలోని బల్లార్షా ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి రెబ్బెన మండలంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో మరికొందరు ఉన్నట్లు పోలీసులు గుర్తించడంతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన ఇద్దరినీ శుక్రవారం జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. రెబ్బెన సీఐ ఎం సంజయ్ మాట్లాడుతూ మండలంలో గంజాయి సాగు, రవాణా, విక్రయం, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయికి యువత దూరంగా ఉండాలని, అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎ వెంకటకృష్ణ, హెచ్‌సీ రవికుమార్, పీసీ నౌషద్ తదితర సిబ్బంది ఉన్నారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచినందుకు ఉన్నతాధికారులు అభినందించారు.

# కరీంనగర్ లో 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు

- **ఇందిరా చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు కాంగ్రెస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ**
- **ప్రజా పాలనతో ఇంటింటా వెలుగులు**
- **సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు**
- **కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**

**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 04, :** ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సారథ్యంలో 1000 రోజుల ప్రజా పాలన - ప్రజా సంక్షేమ దినోత్సవాలను పురస్కరించుకుని నేడు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద సంబరాలు నిర్వహించి, నగరంలోని ప్రధాన వీధుల గుండా భారీ బైక్ ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ ర్యాలీ ఇందిరా చౌక్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, గాంధీ చౌక్, బాబు జగ్జీవన్ రావ్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగింది.

**ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ**

"రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదలకు అందుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి పథకం పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా చేరుతోంది. గత పాలనలో మాదిరిగా ఫామ్ హౌస్ పాలన కాదు, ఇది ప్రజల గడప వద్ద పాలన. మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలతో ప్రతి ఇంట్లో వెలుగులు నింపాం. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపాం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రతిపక్షాలు ఫామ్ హౌస్ లో నిద్రపోతున్న కేసీఆర్ ను లేపడానికి చార్జ్ షీట్ పేరుతో నాటకాలు ఆడుతున్నాయి. తెలంగాణ ప్రజలు మాత్రం ప్రజా పాలనను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కరీంనగర్ ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోశాలలో గోవులకు సేవా కార్యక్రమం

- **అరటి పండ్లు, పచ్చగడ్డిని గోవులకు తినిపించిన ట్రస్ట్ సభ్యులు**
- **గోవులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం - సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు ఇప్పపూల మమత -అజయ్**





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,:** వేములవాడ లోని సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గోవులకు సేవా కార్యక్రమం చేపట్టడం జరిగింది వేములవాడ గోశాలలో గోవులకు అరటి పండ్లు పచ్చ గడ్డిని సాయి రూప చారిటబుల్ ట్రస్టు గౌరవ అధ్యక్షులు, 22 వార్డ్ కౌన్సిలర్ ఇప్పపూల మమత-అజయ్, సభ్యులు కలిసి గోవులకు తినిపించడం జరిగింది ఈ సందర్భంగా ఇప్ప పూల మమతా- అజయ్ మాట్లాడుతూ గోవులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం అని అందులో శ్రీ కృష్ణాష్టమి జన్మదినం సందర్భంగా కృష్ణునికి ఇష్టమైన గోవుల సేవ చేయడం ఆ కృష్ణ పరమాత్ముని సేవ చేయడం ఒక్కటేనని నాకు ఇంత మంచి అవకాశం కల్పించిన సాయి రూప చారిటబుల్ ట్రస్టుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్థాపించిన నాటి నుండి ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందిన సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ మును ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని వారు ఆకాంక్షించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండిరాజు- సరళ, ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతూ గోవుల సేవ చేయడం దేవుని సేవ చేయడం రెండు సమానం అని అందుకే గోవుల సేవ చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోశాల ఇంచార్జ్, సూపర్డెంట్ అరుణ్ కుమార్, ఏ ఈ ఓ నాగుల మహేష్, జూనియర్ అసిస్టెంట్ గొట్టం రవి, సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు, ఇప్పపూల మమత-అజయ్, వ్యవస్థాపక అధ్యక్షులు ఎద్దండీ రాజు - సరళ, ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు, ట్రస్టు కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, ట్రస్టు సభ్యులు అడిగొప్పుల విద్య శ్రీ, గొంటి నవీన్, వాసాల హరిప్రసాద్, సంద్రగిరి రమేష్, నాగుల విగ్నేష్, గొంటి హర్షిత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కన్న పెల్లి నరేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి

## నేడు పురుషోత్తమ చౌదరి జయంతి

ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితామహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగరాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్థంలోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారార్ధం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్రక్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 – ఆగష్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలికులు. తాను రాసిన కీర్తన లను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనాపురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మానాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లివీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ట కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్ధ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభించారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసు కోవాలనే తపనతో అన్వేషించడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడుగా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసు కోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగులో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖపట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు. 1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కులవ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడుకుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు. 1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని – మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష – నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేకతను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణానుభవాన్ని ఇతరులకు ప్రకటించాలనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణించి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారాధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తనలుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా – చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగస్టు 26 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు – ఒకటి 'యేసు నాయక శతకము'; రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహటరీవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్థశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వాఙ్మయంలో మొట్టమొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. . 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా – ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్తిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## 'పితాజీ'గా శిష్య హృదయాల్లో నిలిచిన

# విద్యా తాపసి



**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముద్దు రామకృష్ణయ్య స్మరణ**

**కటిక పేదరికం నుంచి బీబీసీ వరకు అసాధారణ ప్రస్థానం**

**ప్రపంచ దేశాలు తిరిగి విద్యా విధానాలపై అధ్యయనం**

**జగిత్యాల విద్యారంగంలో వినూత్న ప్రయోగాలకు శ్రీకారం**

**వేలాది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన మహోపాధ్యాయుడు**

ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యావేత్త.. సమున్నత ఆశయాలు కలిగిన వ్యక్తి.. విద్యార్థికి పాఠం చెప్పడమే కాదు.. పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే విద్యకు అసలైన అర్థమని ఆచరణలో చూపిన మహోపాధ్యాయుడు ముద్దు రామకృష్ణయ్య. విద్యారంగ అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేసి, వినూత్న ప్రయోగాలతో వేలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఆయనను శిష్యలోకం ప్రేమగా 'పితాజీ' అని పిలుచుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ విద్యా తాపసి జీవిత ప్రస్థానాన్ని స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకం. 1907 అక్టోబర్ 18న అవిభక్త కరీంనగర్ జిల్లాలోని చారిత్రక మంథనిలో సంప్రదాయ పేద కుటుంబంలో ముద్దు రామకృష్ణయ్య జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా చదువుపై ఆయనకున్న తపన మాత్రం తగ్గలేదు. ఉన్నత విద్య కోసం దేశ సరిహద్దులను దాటాలనే సంకల్పంతో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ఆ కాలంలో విదేశాలకు వెళ్లి చదువుకోవడమే గొప్ప సాహసం. అలాంటి పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం కోసం హోటల్‌లో పనిచేయడంతో పాటు చౌకీదారుగా కూడా విధులు నిర్వర్తిస్తూ తన చదువును కొనసాగించినట్లు ఆయన జీవిత విశేషాలు చెబుతున్నాయి. కష్టాలను అవకాశాలుగా మలుచుకుంటూ ఆంగ్ల భాషపై పట్టు సాధించారు.

### బీబీసీలో న్యూస్ రీడర్‌గా..


తన ప్రతిభతో ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేసే స్థాయికి ఎదిగారు. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి విద్యా విధానాలు, సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేశారు. విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని స్వదేశంలోని విద్యారంగానికి ఉపయోగించాలన్న సంకల్పంతో భారత్‌కు తిరిగివచ్చారు. విజయవాడ ఆకాశవాణిలో సహాయ సంచాలకుడిగా పనిచేసినా.. తన అసలు గమ్యం విద్యారంగమేనని భావించారు. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ విద్యాశాఖలోకి అడుగుపెట్టారు.

### జగిత్యాలలో మొదలైన విద్యా విప్లవం

నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, అనంతరం వరంగల్ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. రాష్ట్రంలో బహుళార్థ సాధక పాఠశాలల ఏర్పాటు జరుగుతున్న సమయంలో స్వయంగా కోరుకుని 1958–59 విద్యా సంవత్సరంలో జగిత్యాల బహుళార్థ సాధక ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదే పాఠశాల నేడు 'ఓల్డ్ హైస్కూల్'గా చిరపరిచితం. అప్పట్లో సుమారు వంద మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందానికి మార్గనిర్దేశం చేస్తూ, దాదాపు రెండు వేల మంది విద్యార్థుల విద్యాబోధనకు నాయకత్వం వహించారు. సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యత, నైతిక విలువలతో కూడిన విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పాఠ్యపుస్తకంలోని పాఠంతోనే విద్య పూర్తికాదని.. విద్యార్థిలో వ్యక్తిత్వ వికాసం, బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందాలని విశ్వసించారు.

### ఆ రోజుల్లోనే సాంకేతిక విద్యాబోధన

కాలానికి ఎంతో ముందుండే ఆలోచనలు రామకృష్ణయ్య సొంతం. పాఠశాలలో ఈతకొలను నిర్మించడంతో పాటు అప్పట్లోనే తరగతి గదుల్లో స్పీకర్లు ఏర్పాటు చేయించారు. తన చాంబర్‌లో ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే తరగతి గదుల్లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడే విధానాన్ని ప్రవేశపెట్టారు. నేటి ఆధునిక సమాచార వ్యవస్థలను గుర్తుచేసే ఇటువంటి సాంకేతిక ప్రయోగాలను దశాబ్దాల క్రితమే విద్యాబోధనలో ఉపయోగించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. 1965 జూన్ 26న పదవీ విరమణ చేసే వరకు అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన క్రమశిక్షణ ఎంత కఠినంగా ఉండేదో.. విద్యార్థుల పట్ల ప్రేమ కూడా అంతే ఆత్మీయంగా ఉండేది. అందుకే శిష్యులు ఆయనను ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా తండ్రి స్థానంలో నిలిపి 'పితాజీ' అని ప్రేమగా పిలుచుకున్నారు.




### గురువు జ్ఞాపకంగా నిలిచిన విగ్రహం

రామకృష్ణయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన శతజయంతి వేడుకలను శిష్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన శిష్యుడు, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా ముందుకొచ్చారు. 2010 సెప్టెంబర్ 7న జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో 'పితాజీ' విగ్రహాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణయ్య ప్రియశిష్యుడు సూరజ్ శివశంకర్ నిర్వహణలో, గిరి నాగభూషణం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎలగందుల రమణ, తాడిపర్తి జీవన్‌రెడ్డి, అప్పటి జగిత్యాల ఆర్డీవో అమయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్వర్‌రాజు తదితరులు పాల్గొని రామకృష్ణయ్యకు నివాళులర్పించారు.

### గురువు అంటే పాఠం కాదు.. జీవన మార్గం

నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవ, హాస్యభరిత ప్రసంగం, మానవత్వం, క్రమశిక్షణ.. ఇవన్నీ ముద్దు రామకృష్ణయ్య వ్యక్తిత్వంలో అంతర్భాగాలు. ప్రపంచాన్ని చూసిన అనుభవాన్ని తనకోసం దాచుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడిగా మార్చారు. ఆధునిక సాంకేతికతను విద్యాబోధనకు జోడించాలన్న ఆయన ఆలోచనలు కాలానికంటే ఎంతో ముందున్నాయి. 1985 అక్టోబర్ 21న ఆయన జీవిత ప్రస్థానం ముగిసినా.. తీర్చిదిద్దిన శిష్యుల్లో, జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ చరిత్రలో, విద్యారంగానికి అందించిన వినూత్న ఆలోచనల్లో 'పితాజీ' ముద్దు రామకృష్ణయ్య ఇప్పటికీ సజీవమే. ఉపాధ్యాయుడు ఒక తరగతిని మాత్రమే కాదు.. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దగలడని నిరూపించిన ఆయన జీవితం ఉపాధ్యాయ లోకానికి ఓ పాఠం.. భావితరాలకు ఓ స్ఫూర్తి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన

# రచయిత రెంటాల



**నేడు రెంటాల గోపాలకృష్ణ జయంతి**

రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920–18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామా జిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు.

ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ముగ్గురు పిల్లలతో కలిసి రెజ్లర్ ఆత్మహత్య

రెజ్లర్ అశ్విని సహా ముగ్గురి మృతి.. మరో చిన్నారి పరిస్థితి విషమం

కుటుంబ వేధింపులే కారణమంటూ తండ్రి ఫిర్యాదు

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. నల్‌దుర్గ్ కోట వద్ద తీవ్ర విషాదం

**ధారాశివ్, సెప్టెంబర్ 4 :**మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోట వద్ద లోయలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా మృతి చెందగా.. కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జాతీయ స్థాయి రెజ్లింగ్‌లో అశ్విని ఐదు స్వర్ణాలు, ఆరు రజత పతకాలు సాధించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. క్రీడా రంగంలో గుర్తింపు పొందిన ఆమె మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. అశ్విని మృతికి కుటుంబ సమస్యలే కారణమని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తమామల నుంచి తన కుమార్తె శారీరక, మానసిక వేధింపులు ఎదుర్కొందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలపై విచారణ అనంతరమే పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# పవర్ లిఫ్టర్ కేయాకు ఆన్‌లైన్ వేధింపులు

తన చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని ఆవేదన

నకిలీ ఖాతాలు.. ఏఐ చిత్రాలతో వేధింపులంటూ వెల్లడి

'నా విజయాల గురించే మాట్లాడాలనుకున్నా' అంటూ భావోద్వేగ పోస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :**పవర్‌లిఫ్టింగ్‌లో 140 కిలోల బరువెత్తి సంచలనంగా మారిన భారత యువ అథ్లెట్ కేయా బెనర్జీ.. ఇప్పుడు తాను ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించడంతో పాటు తన ముఖం, శరీరాన్ని ఉపయోగించి కృత్రిమ మేధతో అసభ్యకర చిత్రాలను తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఐపీఎఫ్ ప్రపంచ సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కేయా రజత పతకం సాధించారు. 21 ఏళ్ల వయసులోనే 140 కిలోల బరువును ఎత్తిన ఆమె ప్రదర్శన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన బరువుతో పోలిస్తే మూడున్నర రెట్లకు పైగా బరువును ఎత్తడంతో భారత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించారు. అయితే తన క్రీడా విజయం తర్వాత ఆన్‌లైన్‌లో ఎదురైన అనుభవాలు తీవ్రంగా కలచివేశాయని కేయా తన కొత్త సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించారు. భారత మహిళా అథ్లెట్‌గా తాను లైంగిక వేధింపులతో పాటు జాతి, వంశం, కులాన్ని లక్ష్యంగా చేసుకున్న అభ్యంతరకర వ్యాఖ్యలను ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. తన ముఖం, శరీరాన్ని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి కృత్రిమ మేధతో రూపొందించిన అనేక నకిలీ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేయా ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు కూడా సృష్టిస్తున్నారని తెలిపారు. తాను వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవడానికే ఇష్టపడతానని, వ్యక్తిగత ఖాతాల్లో ఫొటోలను పెద్దగా పంచుకోనని పేర్కొన్నారు. కానీ ప్రతిరోజూ సామాజిక మాధ్యమాల్లో తనకు సంబంధించిన నకిలీ చిత్రాలు కనిపిస్తుండటం తీవ్ర అసహనానికి గురిచేస్తోందన్నారు. తన పాత ఖాతాను ఇన్‌స్టాగ్రామ్ ఇప్పటికే నిలిపివేసిందని, అందులో కేవలం 300 మంది అనుచరులు మాత్రమే ఉన్నారని కేయా తెలిపారు. కొత్త ఖాతా ద్వారా ఈ విషయాలను వెల్లడించాల్సి వచ్చిందన్నారు. 'నా గురించి మాట్లాడేటప్పుడు క్రీడల్లో సాధించిన విజయాలే ప్రస్తావనకు రావాలని కోరుకున్నా. ఈ విషయాలను బహిర్గతం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ నా పక్షాన నేను నిలబడేందుకు మరో మార్గం కనిపించలేదు' అని కేయా పేర్కొన్నారు. క్రీడా రంగంలో సత్తా చాటి దేశానికి పతకం అందించిన యువ అథ్లెట్.. తన విజయాన్ని ఆస్వాదించాల్సిన సమయంలో ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం మహిళా క్రీడాకారుల డిజిటల్ భద్రతపై మరోసారి చర్చకు దారితీసింది.




# మంధాన మరో అరుదైన మైలురాయి

- మూడో భారత క్రికెటర్‌గా రికార్డు!
- మూడు ఫార్మాట్లలోనూ ఒకటికి మించి సెంచరీలు
- రోహిత్, రాహుల్ సరసన స్మృతి మంధాన
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్
- హాంకాంగ్‌పై 124 పరుగులతో విధ్వంసం
- సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్



**కొలంబో, సెప్టెంబర్ 4 :**భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో టెస్టులు, వన్డేలు, టీ20లు.. మూడు ఫార్మాట్లలోనూ ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన మూడో భారత క్రికెటర్‌గా నిలిచారు. మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై సెంచరీతో ఈ ప్రత్యేక క్లబ్‌లో రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ సరసన చేరారు. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్ కూడా మంధానే కావడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో రోహిత్ శర్మ టెస్టుల్లో 12, వన్డేల్లో 34, టీ20ల్లో 5 సెంచరీలు సాధించగా.. కేఎల్ రాహుల్ టెస్టుల్లో 12, వన్డేల్లో 8, టీ20ల్లో 2 శతకాలు నమోదు చేశారు. ఇప్పుడు స్మృతి మంధాన టెస్టుల్లో 2, వన్డేల్లో 14, టీ20ల్లో 2 సెంచరీలతో వారి సరసన నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీల రారాజులుగా పేరొందిన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఈ ప్రత్యేక జాబితాలో లేకపోవడం ఆసక్తికరం. కోహ్లీ టెస్టులు, వన్డేల్లో భారీ సంఖ్యలో సెంచరీలు సాధించినప్పటికీ అంతర్జాతీయ టీ20ల్లో ఒకే శతకం చేశారు. సచిన్ తన కెరీర్‌లో ఒకే ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడారు. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగారు. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు బాటలు వేశారు. ఆమె మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 193 పరుగులు చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకే ఆలౌట్ చేసి 137 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మహిళల ఆసియా కప్‌లో భారత్ సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మంధాన మాత్రం అరుదైన సెంచరీ రికార్డుతో మరోసారి భారత మహిళా క్రికెట్‌లో తన ప్రత్యేకతను చాటుకున్నారు.

# 2027 ప్రపంచకప్‌పై గురి

## బుమ్రా కోసం 'ప్లాన్ బీ'!

స్టార్ పేసర్ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి

బెంగళూరులో మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు

ఆఫ్ఘన్ సిరీస్‌కు ముందు తుది అంచనా

బుమ్రాకు విశ్రాంతిస్తే ప్రిన్స్ యాదవ్‌కు ఛాన్స్

దీర్ఘకాలిక పనిభారం నిర్వహణకే ప్రాధాన్యం




**బెంగళూరు, సెప్టెంబర్ 4 :**2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా విషయంలో బీసీసీఐ ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రతి సిరీస్‌లోనూ అతడిని బరిలోకి దింపడం కంటే కీలక సమయాల్లో పూర్తి ఫిట్‌నెస్‌తో అం దుబాటులో ఉండేలా పనిభారాన్ని నిర్వహించడానికే ప్రాధాన్యం ఇస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు బుమ్రా ఫిట్‌నెస్‌ను మరోసారి పూర్తిస్థాయిలో పరీక్షిస్తోంది. ఒకవేళ అతడికి విశ్రాంతి ఇవ్వాల్సి వస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచుతున్నట్లు సమాచారం. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా వీటిలో పాల్గొంటున్నారు. వైద్య బృందం వీరిని క్లినికల్‌గా ఫిట్‌గా ప్రకటించినప్పటికీ.. మ్యాచ్ పరిస్థితుల్లో శారీరక సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేసే శక్తి, పనిభారాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని అంచనా వేసేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం భారత జట్టు సెప్టెంబర్ 10న ఢిల్లీలో సమావేశం కానుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అంతకంటే ముందే బుమ్రా ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బుమ్రా విషయంలో కేవలం గాయం నుంచి కోలుకున్నారా లేదా అన్నదే కాకుండా.. మ్యాచ్ ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేయగల శక్తి, దీర్ఘకాలిక పనిభారాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

### 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్?

ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చని సమాచారం. జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ప్రిన్స్.. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో గాయంతో ఇబ్బంది పడ్డాడు. ప్రస్తుతం కోలుకుని ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. 2026 ఐపీఎల్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనతో ప్రిన్స్ యాదవ్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భవిష్యత్ పేసర్‌గా సెలెక్టర్లు పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బుమ్రా అందుబాటులో లేకుంటే ఆఫ్ఘన్ సిరీస్‌లో అతడికి మరో అవకాశం దక్కవచ్చు. 2026లో గాయం తర్వాత బుమ్రా పనిభారాన్ని భారత జట్టు మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా పర్యవేక్షిస్తోంది. ఒక్క ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌ను కాకుండా రాబోయే కీలక సిరీస్‌లు, 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడిని వినియోగించాలన్నది బీసీసీఐ వ్యూహంగా కనిపిస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో బుమ్రా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు తేలితే ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. లేదంటే అతడిపై తొందరపడకుండా విశ్రాంతి ఇచ్చి.. 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్‌ను రంగంలోకి దింపే అవకాశమున్నట్లు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

# క్రికెటర్ రోహిత్‌పై రెండేళ్ల నిషేధం!

ధ్రువీకరణ పత్రాల్లో మూడు పుట్టిన తేదీలు

వయసులో 27 నెలల వ్యత్యాసం గుర్తింపు

ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగింపు

మరో 64 మంది యువ క్రికెటర్లపైనా చర్యలు




**కోల్‌కతా, సెప్టెంబర్ 4 :**బిగ్ షాక్: క్రికెటర్ రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల కఠిన నిషేధం విధించిన బీసీసీఐ రోహిత్ యాదవ్‌పై నిషేధం (19) 64 మందిపై బెంగాల్ వేటు (18) వయసు మోసాలపై ఉక్కుపాదం (19) కోల్‌కతా, సెప్టెంబర్ 4 (స్పందన న్యూస్): వయసు ధృవీకరణ పత్రాల్లో తీవ్ర అవకతవకలకు పాల్పడిన భారత అండర్-19 జట్టు ఆటగాడు, బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (దీజజ×) రెండేళ్ల పాటు కఠిన నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నూతన క్రికెట్ సీజన్ ముందస్తుగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (జూాదీ) చేపట్టిన పత్రాల పరిశీలనలో ఈ జాలీ మోసం వెలుగుచూసింది. ఇటీవల శ్రీలంక పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసి, త్వరలో ఆస్ట్రేలియాతో జరగబోయే ద్వైపాక్షిక సిరీస్‌కు ఎంపికైన రోహిత్ వద్ద వేర్వేరు పుట్టిన తేదీలతో ధృవీకరణ పత్రాలు ఉండటమే కాకుండా, వయసులో ఏకంగా 27 నెలల వ్యత్యాసం ఉన్నట్లు నిరూపితమైంది. దీంతో అతడిని ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగించి, దేశంలోని అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు హెచ్చరిక సమాచారం పంపారు. రోహిత్ యాదవ్‌తో పాటు ఇలాంటి వయసు వ్యత్యాసాలకు పాల్పడిన మరో 64 మంది క్రికెటర్లపై బెంగాల్ క్రికెట్ సంఘం వేటు వేసింది. ఈ నిషేధిత జాబితాలో 2022 అండర్-19 ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో కీలక పాత్ర పోషించిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రవికుమార్ కూడా ఉండటం క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపింది. రవికుమార్ వయసులో 40 నెలలకు పైగా భారీ వ్యత్యాసం ఉన్నట్లు నిర్ధారించడంతో అతడి పాత జూనియర్ రికార్డులన్నింటినీ రద్దు చేశారు. భారత జూనియర్ క్రికెట్‌లో సుదీర్ఘకాలంగా ప్రధాన సమస్యగా మారిన వయసు మోసాలను తీవ్రంగా పరిగణిస్తున్న బీసీసీఐ, 2020లో స్వచ్ఛందంగా నిజమైన వివరాలు వెల్లడించేందుకు ఇచ్చిన సడలింపులను ఉల్లంఘించిన ప్రతీ ఒక్కరిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

చురకలు

శనివారం 05.09.2026

# నోరుపారేసుకున్న నటి కస్తూరి



కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్ధాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. నిప్పు రవ్వ, గాడ్ ఫాదర్, సొగ్గాడి పెళ్లాం, మెరుపు, చిలక్కొట్టుడు, అన్నమయ్య, మా ఆయన బంగారం, ఆకాశ వీధిలో, డాన్ శీను, శమంతకమణి, సింబా వంటి సినిమాలతో తెలుగువారిని పలకరించారు. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకున్న కస్తూరి ఆ తర్వాత తన కెరీర్‌కు కొన్నాళ్లు బ్రేక్ ఇచ్చి ఫ్యామిలీ, పిల్లల కోసం అంకితమయ్యారు. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కస్తూరి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. సినిమాలే కాదు బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులో ఆమె నటించిన గృహలక్ష్మీ సీరియల్.. ప్రేక్షకులకు కస్తూరిని దగ్గర చేసింది. ప్రస్తుతం ధర్మస్థల నియోజకవర్గం అనే తెలుగు మూవీలో కస్తూరి శంకర్ నటించారు. ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కస్తూరి నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 4న ధర్మస్థల నియోజకవర్గం మూవీ వరల్డ్ వైడ్‌గా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ ఓ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అన్ని రకాల సినిమాలు వస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని ఒకపక్క ఉంది. తెలుగు సినిమాలు చూస్తూ పెరిగిన దానిని, మాయాబజార్.. కృష్ణార్జున యుద్ధం, ప్రేమాభిషేకం లాంటి సినిమాలు చేసి పెరిగాను. అప్పుడు చూస్తే తెలుగు సినిమాల్లో హీరోలంటే దేవుడు.. దేవుడి అవతారాలు కనిపించేవి. ఆ తర్వాత సాంఘిక చిత్రాలు వచ్చాయి. వాటిలో హీరో పోలీస్, లాయర్, విప్లవకారుడు, న్యాయం కోసం పోరాడే వ్యక్తిగా కనిపించాడు. ఇప్పుడొచ్చే సినిమాల్లో స్మగ్లర్, క్రిమినల్, గ్యాంగ్‌స్టర్ అలాంటి సినిమాలే వస్తున్నాయి. ఇలాంటి వాటి మధ్య ఒక సామాజిక బాధ్యతతో, సామాజిక సందేశంతో వస్తున్న మూవీ అంటే చాలా అరుదు అన్నట్లుగా మారిపోయింది. అలాంటి సినిమాల్లో మా ధర్మస్థల నియోజకవర్గం కూడా ఒకటి అని కస్తూరి చెప్పారు. డైరెక్టర్ ప్రభ గారు నా దగ్గరికి వచ్చిన స్టోరీలో ఒక లైన్ చెప్పారు. అప్పుడే ఆ స్టోరీ నాకు బాగా నచ్చేసింది. నిర్మాత భాస్కర్ గారు ఏఎం రత్నంగారి టీమ్.. నన్ను తెలుగువారిని పరిచయం చేసింది భారతీయుడు చిత్రం. ఆ కనెక్షన్ కూడా నాకుంది. భారతీయుడు, అన్నమయ్య లాంటి సినిమాలు చేసి ఆ తర్వాత పెళ్లి చేసుకుని ఫారిన్‌కి వెళ్లిపోయా. ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చి గృహలక్ష్మీగా అందరికి దగ్గరైన కస్తూరిని ఈ సినిమాలో ఎలా చూపిస్తారో అనుకున్నాను. కానీ ఆయన వచ్చి నన్ను దారుణమైన నెగిటివ్ క్యారెక్టర్ చేయించడంతో షాకయ్యా. నేను ఇప్పటి వరకు ఇలాంటి రోల్‌లో అస్సలు చేయలేదు. కస్తూరి అంటే మా ఇంటి ఆడపిల్ల అని అందరూ అనుకునేవారు.. కానీ ఈ సినిమాలో చీర కూడా కట్టనివ్వలేదు అని కస్తూరి తెలిపారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.



# కృష్ణాష్టమి స్పెషల్

## రాధే కృష్ణ అంటూ నాట్య భంగిమల్లో అలరించిన 'అనసూయ'

## 'కృష్ణుడికి అంతా తెలుసు.. నాకు అది చాలు' అంటూ వ్యాఖ్య

## సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా ఫొటోలు, వీడియో

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రముఖ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ప్రత్యేకంగా సందడి చేశారు. సంప్రదాయ ఎర్రచీరలో నాట్య భంగిమలతో దిగిన ఫొటోలతో పాటు భక్తిగీతానికి నృత్యం చేసిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియో అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్‌గా మారాయి. 'తులసీ కోమలవేణి...' అనే కన్నడ భక్తిగీతానికి అనసూయ నృత్యం చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో అభినయంతో కూడిన నాట్య భంగిమలను ప్రదర్శించారు. ఈ వీడియోకు 'కృష్ణుడికి అంతా తెలుసు.. నాకు అది చాలు' అంటూ క్యాప్షన్ జోడించారు. అంతేకాకుండా ప్రశాంతత, స్వీయ నియంత్రణ, స్వచ్ఛత, క్షమాగుణం, ముక్కుసూటితనం, జ్ఞానం వంటి లక్షణాల ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అనసూయ పోస్ట్‌కు అభిమానుల నుంచి స్పందన వస్తోంది. ఇటీవల సనాతన ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యల చుట్టూ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగిన నేపథ్యంలో.. కృష్ణాష్టమి సందర్భంగా ఆమె పంచుకున్న తాజా వీడియో కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.



## తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో

# మాస్ మహారాజా

## హారర్ కామెడీగా కొత్త మూవీ

## సంక్రాంతి కానుకగా విడుదల



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టిన మాస్ మహారాజా రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో ఊహించని వినూత్న బాట పట్టారు. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ బ్లాక్‌బస్టర్ విజయం ఇచ్చిన జోష్‌తో, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని సరికొత్త కథాంశాలను ఆయన ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన చిత్రానికి అంగీకారం తెలిపారు. తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో రవితేజ తొలిసారిగా 'హారర్ కామెడీ' జోనర్‌లోకి అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. వివేక్ ఆత్రేయ మార్క్ స్క్రీన్‌ప్లే, రవితేజ నటన, ఎనర్జీ తోడైతే థియేటర్లలో వినోదం హామీ అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. దీంతో పాటు 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణుతో కలసి దిల్ రాజు నిర్మిస్తున్న మల్టీస్టారర్ కామెడీ చిత్రంలోనూ రవితేజ నటించనున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ

ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ్'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ్' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది.'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలో విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ)కి సమర్పించారు. అయితే, చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సున్నితమైన అంశాలపై బోర్డు అభ్యంతరం తెలిపి, పలు మార్పులను సూచించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన డైలాగులు, శృంగార సన్నివేశాలు, అలాగే ఉగ్రవాదానికి సంబంధించిన కొన్ని సీన్లు, డైలాగులను తొలగించాలని సెన్సార్ బోర్డ్ సూచించింది. అయితే నిర్మాతలు మాత్రం సెన్సార్ బోర్డు సూచించిన మార్పులు చేయడానికి నిరాకరించారు. సన్నివేశాలను లేదా కంటెంట్‌ను మార్చడం వల్ల సినిమా అంతా ఎఫెక్టివ్ గా ఉ ండదని దర్శక నిర్మాతలు భావించారు. దీని తర్వాత, చిత్ర బృందం సెన్సార్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసింది. అయినప్పటికీ, 'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలోని థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతించలేదు. భారతదేశంలో విడుదల కానప్పటికీ 'అన్‌ఫ్రీడమ్' అంతర్జాతీయంగా పలు సినిమా ఈవెంట్లు, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లోనూ ప్రదర్శితమైంది. పలు సున్నితమైన అంశాలను చూపించిన తీరుకు పలు ప్రశంసలు, అవార్డులు కూడా వచ్చాయి. సెన్సార్‌షిప్, భావ ప్రకటనా స్వేచ్ఛ, భారతీయ సినిమాలో సున్నితమైన అంశాల చిత్రీకరణపై చర్చలను రేకెత్తించిన చిత్రాలలో 'అన్‌ఫ్రీడమ్' సినిమాను ఒకటిగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com